E-KABURU E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

26-3-2025 బుధవారం | పేజీలు-6 | హైదరాబాద్ | ekaburu.com



2లో

తెలంగాణ ఫిరాయింపులపై సుప్రీం కోర్టు సంచలన వ్యాఖ్యలు



ఖాజాగూడ కొత్త కుంట చెరువును పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్

3లో




భవానీపురం కాలనీ సమస్యలు పరిష్కరించాలని ఎంపీ విశ్వేశ్వరరెడ్డికి వినతి



పోరాడి ఓడిన గుజరాత్.. బోణీ కొట్టిన పంజాబ్

6లో



ఆ ధైర్యంతోనే ఆటగాళ్లు భయం లేకుండా ఆడుతున్నారు: ధోనీ



పాఠశాలల మూసివేతపై సభలో వాగ్వాదం

4లో



# అసెంబ్లీలో త్రిబులార్ పై రచ్చ

**ఈ కబురు ,హైదరాబాద్:** అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిల మధ్య మాటల యుద్ధం జరిగింది. ట్రీపుల్ఆర్‌పై కాంగ్రెస్‌ది అసత్య ప్రచారమంటూ ప్రశాంత్‌రెడ్డి మండిపడ్డారు. ట్రిపుల్ ఆర్ కోసం కష్టపడింది బీఆర్ఎస్సే. 15 నెల్లలో మీ ప్రభుత్వం ఏం చేసిందో చెప్పాలి. 2017లో అనుమతి వస్తే అప్పుడే ఆగిపోయిందని ప్రచారమా? అంటూ ప్రశాంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశాంత్‌రెడ్డి వ్యాఖ్యలపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మండిపడుతూ.. ట్రిపుల్ ఆర్‌పై మాట్లాడే హక్కు బీఆర్ఎస్‌కు లేదన్నారు. ‘‘మేం ఓఆర్ఆర్ కడితే మీరు అమ్ముకున్నారు. ఎన్నికల ముందు రోడ్లు అమ్ముకునే పరిస్థితికి తెచ్చారు. 2014 నుంచి మీరు వేసిన రోడ్లకు డబ్బుకు మేం కడుతున్నామని కోమటిరెడ్డి అన్నారు.

**మన ఊరు-మన బడి పథకంలో భారీ స్కాం: అక్బరుద్దీన్ ఓవైసీ**

అసెంబ్లీలో అక్బరుద్దీన్ తరువాయి 2లో

# మంత్రి వర్గ విస్తరణకు గ్రీన్ సిగ్నల్..

# ఆ నలుగురికే ఛాన్స్!



- ఏప్రిల్ 3న కొత్త మంత్రుల ప్రమాణ స్వీకారం ?
- ప్రస్తుతం ఖాళీగా ఉన్న 6 మంత్రిపదవుల్లో 4 భర్తీ కానున్నాయి



**తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ విస్తరణకు ఏఐసీసీ పచ్చజెండా ఊపింది. ఏప్రిల్ 3న కొత్త మంత్రుల ప్రమాణ స్వీకారం ఉండే అవకాశం ఉంది.**

**ఈ కబురు ,ఢిల్లీ:** తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ విస్తరణకు కాంగ్రెస్ అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు, ప్రస్తుతం కేబినెట్‌లో ఆరు మంత్రి పదవులు ఖాళీగా ఉండగా.. ఇందులో నాలుగు స్థానాలను భర్తీ చేయనున్నట్లు తెలుస్తున్నది. మైనారిటీలకు ఇవ్వాలనుకుంటే మరొకరికి అవకాశం కల్పించనుంది. ఇద్దరు రెడ్లు, ఒక బీసీ,ఒక ఎస్సీ సామాజిక వర్గం నేతకు అవకాశం కల్పించనుండగా.. చీఫ్ విప్ మాత్రం రెడ్డి సామాజిక వర్గం నేతకు కట్టబెట్టేయోచనలో అధిష్టానం నిర్ణయం తీసుకుందని పార్టీ వర్గాలు తరువాయి 2లో

## ‘దేవుళ్లని మోసం చేసిన రేవంత్‌కు రైతులను మోసం చేయడం ఓ లెక్క’

3లో





2లో

## సౌగత్ఏమోదీ' పేరుతో ముస్లింలకు బీజేపీ ఈద్ కిట్లు

బీజేపీ మహిళా మోర్చా జాతీయ అధ్యక్షుడు జమాల్ సిద్ధిఖి ఈ కార్యక్రమం గురించి మాట్లాడుతూ, 'సౌగత్-ఏ-మోదీ' ముస్లింల సంక్షేమానికి చేపట్టమని విశిష్ట కార్యక్రమమని, పేద ముస్లిం కుటుంబాలకు ఈద్‌ను ఆనందంగా జరుపుకునేందుకు వీలుకల్పిస్తుందని చెప్పారు.

## నీతీశ్ ఆరోగ్య పరిస్థితి వెల్లడించాలి



**బిహార్ సీఎం నీతీశ్ కుమార్‌పై ప్రశాంత్ కిశోర్ మరోసారి తీవ్ర విమర్శలు చేశారు.**

బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ పై ఎన్నికల వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. బహిరంగ కార్యక్రమాలు, మీడియా సమావేశాల్లో సీఎంను మాట్లాడనీయకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ప్రజల దృష్టి నుంచి తప్పించేందుకే సీఎం సన్నిహితులు ఇలా చేస్తున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో సీఎం మానసిక స్థితిపై వైద్య నివేదిక విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

‘‘నీతీశ్ కుమార్ తరువాయి 3లో

## ‘అప్పుడు బీఆర్ఎస్‌తో ఉన్నారు.. ఇప్పుడు మీ పార్టీలో ఉన్నారు’



**ఈ కబురు హైదరాబాద్:** గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మన ఊరు మన బడి పథకంలో పెద్ద స్కాం జరిగిందని ఎంఐఎం ఎంపీ అక్బరుద్దీన్ ఓవైసీ ఆరోపించారు. అది కాళేశ్వరం కంటే పెద్ద స్కామ్ అని పేర్కొన్నారు. ఈరోజు (మంగళవారం) అసెంబ్లీ వేదికగా మన ఊరు మన బడి అంశానికి సంబంధించి మాట్లాడారు. ‘ మన ఊరు మన బడి పథకంలో పెద్ద స్కాం జరిగింది.

మన ఊరు మన బడి లో ఏమి పని జరగలేదు... జరిగిన దానికి నిదులు తరువాయి 3లో

## ముందే లీక్.. మరీ ఇంత నిర్లక్ష్యమా?



**వాషింగ్టన్:** వైట్‌హౌజ్‌లో అధికారుల నిర్లక్ష్యం బయటపడడం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పొరపాటున యెమెన్ యుద్ధ ప్రణాళికను ఓ జర్నలిస్టుతో పంచుకున్నారు. అదీ.. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటన చేయకముందే కావడం ఇక్కడ గమనార్హం

అమెరికా రక్షణశాఖమంత్రి పీట్ హెగ్సెత్, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఇతర ముఖ్య అధికారులు ఉన్న గ్రూప్‌లోకి ఓ యూఎస్ జర్నలిస్టుకు ప్రవేశం కల్పించారు. ఆ గ్రూప్‌లో అతనున్నాడనే విషయం కూడా హౌతీ రెబల్స్‌పై తరువాయి 3లో





## జూన్ నుంచి యూపీఐ, ఏటీఎం ద్వారా పీఎఫ్ విత్‌డ్రా

**జూన్ నుంచి పీఎఫ్ నిధులను యూపీఐ, ఏటీఎం ద్వారా విత్‌డ్రా చేసుకునే సదుపాయం అందుబాటులోకి రానుంది.**

**ఈ కబురు , దిల్లీ:** ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (పీఎఫ్) కీలక సంస్కరణలు దిశగా అడుగులు వస్తోంది. ఈపీఎఫ్ నుంచి నిధుల ఉపసంహరణను సులభతరం చేయనుంది. త్వరలో యూపీఐ నగదు విత్ డ్రా చేసుకునే సదుపాయం అందుబాటులోకి రానుంది. ఇందుకు సంబంధించి నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ప్రతిపాదనలకు కార్మిక శాఖ ఆమోదం తెలిపిందని ఆ శాఖ కార్యదర్శి సుమిత్రా తరువాయి 3లో

## అసెంబ్లీ ముట్టడికి న్యాయవాదుల యత్నం..

# పోలీసుల అరెస్టు..

**తన వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడనే కక్ష్యతో 10 రోజుల పాటు రెక్కి చేసిన తర్వాత ఎలక్ట్రిషన్ దస్తగిరి అనే వ్యక్తి న్యాయవాదిని హత్య చేశాడు. ఈ కేసులో పోలీసుల విచారణ కొనసాగుతోంది. మరోవైపు మంగళవారం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదులు తమ విధులను బహిష్కరించి నిరసలు తెలుపుతున్నారు. ఈ క్రమంలోనే ..**

**ఈ కబురు [హైదరాబాద్]:** తెలంగాణ అసెంబ్లీ దగ్గర ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. నిన్న (సోమవారం) న్యాయవాది హత్య ఘటనపై నిరసనగా అసెంబ్లీ ముట్టడికి న్యాయవాదులు యత్నించారు. అడ్వేట్ ప్రొటెక్షన్ యాక్ట్ ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ వైపు దూసుకువెళుతున్నన్యాయవాదులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు, న్యాయవాదుల మధ్య తోపులాట జరిగింది. గన్‌పార్క్ వద్ద న్యాయవాదులను పోలీసులు అరెస్టు చేశారు. కాగా సోమవారం చంపాపేటలోని న్యాయవాది ఎర్రబాపు ఇజ్రాయెల్‌ను అతి దారుణంగా హత్య చేశారు. ఈ ఘటన తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేకెత్తించింది.

తన వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడనే కక్ష్యతో 10 రోజుల పాటు రెక్కి చేసిన తర్వాత ఎలక్ట్రిషన్ దస్తగిరి అనే వ్యక్తి హత్యకు పాల్పడ్డాడు. తరువాయి 2లో





# అసెంబ్లీ ముట్టడికి న్యాయవాదుల యత్నం..
# పోలీసుల అరెస్టు..

**మొదటి పేజీ తరువాయి**

ఈ కేసులో పోలీసుల విచారణ కొనసాగుతోంది. మరోవైపు మంగళవారం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదులు తమ విధులను బహిష్కరించి నిరసలు తెలుపుతున్నారు. ఈ క్రమంలోనే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో అసెంబ్లీ ముట్టడికి న్యాయవాదులు యత్నించారు. దీంతో పోలీసులు వారిని అడ్డుకుని అదుపులోకి తీసుకుని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. గన్ పార్క వద్ద నిరసన తెలియజేయడానికి వచ్చిన సమయంలో న్యాయవాదులు.. పోలీసుల మధ్య వాగ్వాదం జరిగింది.

కాగా ప్రియురాలి చిరునామా చెప్పడంలేదని ఓ న్యాయవాదిని దారుణంగా చంపాడో దుండగుడు. ఈ ఘటన సోమవారం హైదరాబాద్‌లోని ఐఎస్ సదన్‌లో జరిగింది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుమ్మలూరు గ్రామానికి చెందిన న్యాయవాది, కాంగ్రెస్ సీనియర్ నేత ఇజ్రాయెల్ కుటుంబసభ్యులతో కలిసి ఐఎస్ సదన్ పరిధిలోని చంపాపేటలో నివాసముంటూ.. తన ఇంటికి సమీపంలోని ఓ అపార్ట్‌మెంటులో కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. ఆ అపార్ట్‌మెంట్‌లోని వాచ్‌మెన్ భార్యతో అదే ప్రాంతంలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న దస్తగిరి అనే వ్యక్తికి వివాహేతర సంబంధం ఏర్పడింది. దాంతో ఇరు కుటుంబాల మధ్య గొడవలు జరుగుతుండగా ఇజ్రాయెల్ వారికి రాజీ కుదిర్చాలని ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో అపార్ట్‌మెంట్ వాసులు వాచ్‌మెన్ కుటుంబాన్ని పనుల నుంచి తొలగించగా, వారు తమ స్వస్థలానికి వెళ్లిపోయారు. ఇదిలా ఉండగా ఆమెను హైదరాబాద్‌కు పిలిపించాలని దస్తగిరి పలుమార్లు ఇజ్రాయెల్‌ను కోరాడు. తాను లాయర్‌నని బ్రోకర్‌ను కాదని ఇజ్రాయెల్ దస్తగిరిపై తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో వారు దస్తగిరిని పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి పంపారు. వాచ్‌మెన్ భార్య తనకు దూరం కావడానికి ఇజ్రాయెలే కారణమని భావించిన దస్తగిరి, ఆయన వల్లే పోలీసులు తనకు కౌన్సిలింగ్ ఇవ్వడాన్ని జీర్ణించుకోలేకపోయాడు. దాంతో ఇజ్రాయెల్‌పై పగ పెంచుకుని చంపాలని పథకం పన్నాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఇజ్రాయెల్ వాకింగ్‌కు వెళ్లి వస్తున్న సమయంలో దస్తగిరి కాపుకాసి ఆయనపై కత్తితో అందరూ చూస్తుండగానే విచక్షణారహితంగా దాడి చేశాడు. స్థానికులు ఇజ్రాయెల్‌ను అస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు.

**హైకోర్టులో విధుల బహిష్కరణ**

ఎర్రబాపు ఇజ్రాయెల్ అనే న్యాయవాదిని ప్రత్యర్థి కక్షిదారు హత్య చేసిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు హైకోర్టు బార్ అసోసియేషన్ పేర్కొంది. ఇందుకు నిరసనగా మంగళవారం హైకోర్టులో విధులు బహిష్కరిస్తున్నట్లు పేర్కొంది. అయితే హైకోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికల ప్రక్రియ యథావిధిగా కొనసాగుతుందని పేర్కొంది.



# అసెంబ్లీలో త్రిబులార్ పై రచ్చ

**మొదటి పేజీ తరువాయి**

ఓవైసీ మాట్లాడుతూ.. మన ఊరు మన బడి పథకంలో పెద్ద స్కాం జరిగిందన్నారు. 'మన ఊరు మన బడిలో ఏ పని జరగలేదు. జరిగిన దానికి నిధులు విడుదల కాలేదు. మన ఊరుమన బడి పథకంలో బెంచీల కొనుగోళ్లలో స్కాం జరిగింది. ఈ స్కాం పై ప్రశ్న వేద్దాం అనుకుంటే ప్రశ్నోత్తరాలు రద్దు చేస్తున్నారు. 14, 18, 20 వేల ఒక్కో బెంచ్ కొన్నారు. బెంచీల కొనుగోళ్ల పై ఈ ప్రభుత్వం విచారణ చేయించాలి'' అని ఆయన డిమాండ్ చేశారు.

నేను పేర్లు చెప్పలేని...కాళేశ్వరం కంటే పెద్ద స్కాం. నిధులను లూటీ చేశారు.. 32లక్షల బెంచీలను కొనుగోలు చేశారు. ఐదు వేలకు ఒక బెంచ్ వస్తది. 20 వేల పెట్టీ కొన్నారు. పెద్ద స్కాం చేశారు...అప్పుడు బీఆర్ఎస్‌తో ఉన్నారు.. ఇప్పుడు మీ పార్టీలో ఉన్నారు.'' అంటూ అక్బరుద్దీన్ ఓవైసీ ఆరోపించారు.

# పాఠశాలల మూసివేతపై సభలో వాగ్వాదం

**పాఠశాలల మూత, ఉపాధ్యాయ పోస్టుల భర్తీ అంశాలపై శాసనసభలో భారాస, కాంగ్రెస్ సభ్యుల మధ్య మంగళవారం తీవ్ర వాగ్వాదం జరిగింది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పిల్లలు చేరలేదని చెబుతూ 1,913 పాఠశాలలను మూసేశారని, కేవలం 10 మందిలోపే ఉన్నారనే సాకుతో మరో 4,000 స్కూళ్లలోని విద్యార్థులను ఇతర పాఠశాలలకు పంపాలని చూస్తున్నారని భారాస ఎమ్మెల్యే సబితారెడ్డి తొలుత ఆరోపించారు.**

**ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కొత్తగా బడులను తెరుస్తామన్నారు కదా...**

**మీరొచ్చాక 1,913 ఎందుకు మూతపడ్డాయని ప్రశ్నించిన సబితా ఇంద్రారెడ్డి**

**ఈ కబురు [హైదరాబాద్] :** పాఠశాలల మూత, ఉపాధ్యాయ పోస్టుల భర్తీ అంశాలపై శాసనసభలో భారాస, కాంగ్రెస్ సభ్యుల మధ్య మంగళవారం తీవ్ర వాగ్వాదం జరిగింది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పిల్లలు చేరలేదని చెబుతూ 1,913 పాఠశాలలను మూసేశారని, కేవలం 10 మందిలోపే ఉన్నారనే సాకుతో మరో 4,000 స్కూళ్లలోని విద్యార్థులను ఇతర పాఠశాలలకు పంపాలని చూస్తున్నారని భారాస ఎమ్మెల్యే సబితా రెడ్డి తొలుత ఆరోపించారు. విద్యాశాఖ పద్దుపై జరిగిన చర్చలో ఆమె మాట్లాడుతూ... ''భారాస పాలనలో ఆరు వేల స్కూళ్లను మూసేశారని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డి ఆరోపించారు. అధికారంలోకి రాగానే వాటిని తెరిపిస్తామన్నారు. వాటిలో ఎన్నింటిని తెరిచారో చెప్పాలి. ప్రతి గ్రామ పంచాయతీలోనూ పాఠశాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. మరిప్పుడు 257 పంచాయతీల్లో పాఠశాలలు ఎందుకు లేవో వెల్లడించాలి. విద్యాశాఖ సీఎం వద్దే ఉన్నా ప్రభుత్వ పాఠశాలల్లో గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది 3.60 లక్షల మంది విద్యార్థుల సంఖ్య ఎందుకు తగ్గింది'' అని ప్రశ్నించారు.

**తీవ్ర అభ్యంతరం తెలిపిన మంత్రి శ్రీధర్‌బాబు**

మంత్రి శ్రీధర్‌బాబు కల్పించుకుని... ''పదేళ్ల భారాస పాలనలో కుప్పకూలిన విద్యావ్యవస్థను సరిచేయడానికి సమయం పడుతుంది. ఈ ఏడాది 79 పాఠశాలలను తిరిగి తెరిపించాం. నాటి సీఎం కేసీఆర్ ఒక్కసారి కూడా విద్యాశాఖపై సమీక్షించలేదు. డీఎస్సీ ద్వారా ఒక్క టీచర్‌ను కూడా నియమించకపోవడంతోనే పాఠశాలలు మూతపడ్డాయి. మేం వాటిపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాం. భారాస పాలనలో విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పుడు సబితారెడ్డి చాలా పనులు చేయాలనుకున్నా ఆ వ్యవస్థ ఒకవైపే నడవడంతో ఏమీ చేయలేకపోయారు'' అని విమర్శించారు. దీనిపై భారాస సభ్యుడు హరీశ్‌రావు అభ్యంతరం చెబుతూ... ''మేం 26 వేల మంది ఉపాధ్యాయులను నియమించాం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మూసివేసిన పాఠశాలలపై శ్రీధర్‌బాబు ఎందుకు మాట్లాడరు?'' అని ప్రశ్నించారు. తిరిగి సబితారెడ్డి మాట్లాడుతూ... ''మీరు చిత్తశుద్ధితో పనిచేస్తే విద్యార్థులు ఎందుకు తగ్గారనే దానిపై సమీక్షించుకోవాలి. ప్రభుత్వ పాఠశాలల భవనాలను మనఊరుమనబడి కింద భారాస పాలనలో బాగుచేశాం. మిగిలిన వాటిని మీరు బాగు చేయాలి. ఒక్కో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు రూ.200 కోట్లు ఖర్చు పెడతామంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం... ఇతర ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రూ.4 వేల కోట్లు పెట్టలేదా? వాటిని మూసివేస్తారా? అరకొర బడ్జెట్‌తో విద్యారంగాన్ని ప్రపంచస్థాయిలో ఎలా అభివృద్ధి చేస్తారు? సమగ్ర శిక్షా కింద ఈ ఏడాది రూ.1,913 కోట్లు ఇవ్వడానికి కేంద్రం ఆమోదం తెలిపింది. వీటిలో మూడో త్రైమాసికానికి ఇటీవల రూ.242 కోట్లు ఇచ్చినా... రాష్ట్ర వాటా రూ.160 కోట్లు విడుదల చేయకపోవడంతో వెనక్కిపోయాయి. దాంతో వచ్చే ఏడాది(202526)కి తెలంగాణకు రూ.1,600 కోట్లే ఇస్తామని కేంద్రం తెలిపింది. ఈ వైఫల్యం ఎవరిదో కచ్చితంగా ప్రశ్నించుకోవాలి. ఇక కొడంగల్ పాఠశాలల్లో మాత్రమే ఉదయం అల్పాహారం పెడుతున్నారు. దీన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలి'' అని కోరారు. మంత్రి జూపల్లి కృష్ణారావు కల్పించుకుని... ''తెలంగాణలో తొలిసారి ఏర్పడిన భారాస ప్రభుత్వంలో నేను పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్నాను. అప్పుడు ఒకసారి జరిగిన కలెక్టర్ల సదస్సులో కేజీ టూ పీజీ విద్య గురించి చెప్పా. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను ఉదయం 7 నుంచి సాయంత్రం 7గంటల వరకు ఉంచి... వారికి అక్కడే ట్యూషన్ ఏర్పాటు చేయాలని సూచించినా పట్టించుకోలేదు. విద్యార్థులను ప్రయివేటు కాలేజీల్లో చేర్పించడానికి తల్లిదండ్రులు అప్పులు చేస్తున్నారు. మరోవైపు రూ.లక్షల కోట్ల అప్పులు చేస్తున్న సర్కారు... ప్రభుత్వ పాఠశాలలను ఎందుకు విస్మరిస్తోందని ఆనాడే ప్రశ్నించా'' అని గుర్తుచేశారు.

# ...ఆ నలుగురికే ఛాన్స్!

**మొదటి పేజీ తరువాయి**

చెబుతున్నాయి. తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ విస్తరణకు ఏఐసీసీ పచ్చజెండా ఊపింది. ఏప్రిల్ 3న కొత్త మంత్రుల ప్రమాణ స్వీకారం ఉండే అవకాశం ఉంది. ఇద్దరు బీసీలు, రెడ్డి, ఎస్సీకి మంత్రివర్గంలో చోటు దక్కనున్నట్లు సమాచారం. ఈ మేరకు రాష్ట్ర కోర్ కమిటీ నుంచి ఏఐసీసీ వివరాలు తీసుకుంది. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ నుంచి అభిప్రాయాలు సేకరించింది. సుదర్శన్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డిలో ఒకరికి చోటు దక్కే అవకాశం ఉంది. బీసీలో శ్రీహరి ముదిరాజ్, ఆది శ్రీనివాస్‌కు.. ఎస్సీలో చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి చోటు దక్కే అవకాశం ఉంది. మొత్తం ఆరు ఖాళీల్లో నాలుగైదు స్థానాలు భర్తీ చేసే అవకాశం ఉంది. మైనారిటీలకు అవకాశమిస్తే ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్‌కు చోటు దక్కే అవకాశం ఉంది. ఇక ప్రస్తుతం మంత్రి పదవి రేసులో పలువురు ఎమ్మెల్యేల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. వారిలో చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్, ఇబ్రహీంపట్నం మల్‌రెడ్డి రంగారెడ్డి, మక్తల్ ఎమ్మెల్యే వాకాటి శ్రీహరి,మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిలు ఉన్నారు. అయితే, అధిష్టానం ఎవరివైపు మొగ్గుచూపితే వారికే మంత్రి పదవి ఖాయం. ఈ అంశంపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇక, కేబినెట్ విస్తరణపై ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, రాష్ట్ర కోర్ కమిటీ నుంచి ఏఐసీసీ వివరాలు సేకరించింది. ఆ వివరాల ఆధారంగా మంత్రి పదవులు కేటాయింపు ఉంటుంది.



# సౌగత్‌ఏమోదీ' పేరుతో ముస్లింలకు
# బీజేపీ ఈద్ కిట్లు

ఈ కబురు (న్యూఢిల్లీ): రంజాన్ మాసం సందర్భంగా భారతీయ జనతా పార్టీ (వినూత్న కార్యక్రమం చేపట్టింది. దేశవ్యాప్తంగా ఉన్న ముస్లింలకు చేరువయ్యేందుకు ''సౌగత్‌ఏమోదీ'' అనే కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమం కింద 32 లక్షల మంది పేద ముస్లింలకు రంజాన్ ప్రత్యేక కిట్లు అందజేయనుంది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సౌత్‌ఈస్ట్ ఢిల్లీలోని నిజాముద్దీన్ నుంచి మంగళవారంనాడు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

ఈ ప్రత్యేక కిట్‌లో ముస్లిం మహిళలు, పురుషులకు దుస్తులతో పాటు, సేమియా, డ్రైఫ్రూట్స్, ఖర్జూరం, చక్కెర వంటి ఫుడ్ ఐటెమ్స్ ఉన్నాయి. ఒక్కో కిట్ ధర రూ.500 నుంచి 600 వరకూ ఉంటుంది. బీజేపీ మహిళా మోర్చా జాతీయ అధ్యక్షుడు జమాల్ సిద్ధిఖీ ఈ కార్యక్రమం గురించి మాట్లాడుతూ, 'సౌగత్‌ఏమోదీ' ముస్లింల సంక్షేమానికి చేపట్టమని విశిష్ట కార్యక్రమమని, పేద ముస్లిం కుటుంబాలకు ఈద్‌ను ఆనందంగా జరుపుకునేందుకు వీలుకల్పిస్తుందని చెప్పారు. ఈద్‌కు మాత్రమే కాకుండా గుడ్ ఫ్రైడే, ఈస్టర్ వంటి పండుగల్లోనూ ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. 140 కోట్ల మంది భారతీయులకు తాను సంరక్షకుడనని ప్రధాని మోదీ ప్రతిసారి చెబుతుంటారని, అందుకు అనుగుణంగానే ఆయన అన్ని పండుగల్లోనూ పాల్గొంటూ ఉంటారని చెప్పారు. క్రిస్టమస్, ఈస్టర్ వంటి పండుగల్లో పాల్గొనడం, అజ్మీర్‌లోని నిజాముద్దీన్ దర్గాకు ఛాదర్ పంపుతుంటారని అన్నారు. ఈద్ పండుగ కానుకగా దేశవ్యాప్తంగా 32 లక్షల మంది నిరుపేద ముస్లింలకు ప్రత్యేక బహుమతులు అందిస్తున్నామన్నారు. 32,000 మసీదుల్లో 32,000 బీజేపీ కార్యకర్తలు ఈ కార్యక్రమాన్ని నిర్వహించి కిట్లు అందజేస్తారని చెప్పారు.

బీహార్ అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో ముస్లిం సమాజంలో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి, ఆ వర్గాలతో సంబంధాలను మరింత బలపరుచుకోవాలని బీజేపీ ఆలోచనగా ఉంది. 243 స్థానాలున్న బీహార్ అసెంబ్లీకి ఈ ఏడాది అక్టోబర్‌నవంబర్‌లో ఎన్నికలు జరుగనున్నాయి. 2020 బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే 125 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్‌ఆర్జేడీఇతర పార్టీలతో కూడిన మహాఘట్‌బంధన్ 110 సీట్లు గెలుచుకుంది.

# తెలంగాణ ఫిరాయింపులపై
# సుప్రీం కోర్టు సంచలన వ్యాఖ్యలు

**ఈ కబురు:** తెలంగాణ ఫిరాయింపు ఎమ్మెల్యేల పిటిషన్లపై సుప్రీం కోర్టులో మంగళవారం విచారణ జరిగింది. ఈ క్రమంలో పార్టీ ఫిరాయింపులపై సర్వోన్నత న్యాయస్థానం సంచలన వ్యాఖ్యలు చేసింది. ఆయారాం, గయారాంలను నిరోధించేందుకే రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ఉందని, అలాంటప్పుడు ఫిరాయింపులపై ఏ నిర్ణయం అనేది తీసుకోకపోతే ఆ షెడ్యూల్‌ను అపహాస్యం చేయడం కిందకే వస్తుందని స్పష్టం చేసింది.


కారు గుర్తుపై గెలిచిన ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లోకి పార్టీ ఫిరాయించారని.. ఆ 10 మందిపై అనర్హత వేటు విషయంలో తెలంగాణ స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకోవడం లేదని, కాబట్టి అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ తరపున ఈ జనవరిలో వేర్వేరు పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై జస్టిస్ బీఆర్ గవాయ్, ఆగస్టిన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం వాదనలు వింటోంది.

మంగళవారం వాదనలు మొదలవ్వగానే.. అసెంబ్లీ కార్యదర్శి దాఖలు చేసిన కౌంటర్ అఫిడవిట్ సంగతిని స్పీకర్ తరఫున వాదనలు వినిపిస్తున్న సీనియర్ లాయర్ ముకుల్ రోహత్గీ వాదనలు ప్రస్తావించారు. ఈ వ్యవహారంలో స్పీకర్‌ను ఆదేశించే అధికారం న్యాయస్థానానికి ఉంటుందా? లేదంటే రాజ్యాంగ ధర్మాసనానికి నివేదించాలా? అని కోరారు.

బీఆర్ఎస్ తరపున న్యాయవాది ఆర్యమా సుందరం వాదనలు వినిపిస్తూ.. ''ఫిర్యాదులపై ఏం చేస్తారో.. 4 వారాల్లో షెడ్యూల్ చేయాలని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. అయినా పార్టీ మారిన వారికి స్పీకర్ నోటీసులు ఇవ్వలేదు. ధర్మాసనం కొన్ని వ్యాఖ్యలు చేసిన తర్వాతే నోటీసు ఇచ్చారు. 3 వారాల్లో రిప్లై ఇవ్వాలని.. ఫిబ్రవరి 13న స్పీకర్ నోటీసులు ఇచ్చారు. ఇప్పటికి 3 వారాలైంది.. నోటీసులు ఎటు వెళ్లాయో తెలియదు. మేము ఫిర్యాదు చేసి ఏడాదైనా స్పీకర్ షెడ్యూల్ కూడా చేయలేదు'' అని సుందరం వాదించారు.

**పార్టీ మారినవాళ్లు లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున ప్రచారం చేశారు**

ముగ్గురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌కు ప్రచారం చేశారు



**తెలంగాణ: ఫిరాయింపులపై సుప్రీం కోర్టు సంచలన వ్యాఖ్యలు**

మరోవైపు.. స్పీకర్ తరపున సోమవారం(మార్చి 24వ తేదీన) అసెంబ్లీ కార్యదర్శి దాఖలు చేసిన కౌంటర్‌లో.. ''రీజనబుల్ టైం అంటే గరిష్టంగా మూడు నెలలే అని అర్థం కాదు. ఒక్కో కేసు విచారణకు ఒక్కో రకమైన సమయం అవసరం. ఇప్పటికే పలువురు ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చాం. కానీ, స్పీకర్‌కు ఫిర్యాదు చేసిన వెంటనే కోర్టుకు వెళ్లారు. స్పీకర్ ఈ అంశంపై నిర్ణయం తీసుకున్న తర్వాతే.. న్యాయపరమైన పరిష్కారం కోసం ప్రయత్నించాలి. అప్పటిదాకా న్యాయస్థానాల జోక్యం కుదరదు. .. అనర్హత పిటిషన్ లను విచారించి నిర్ణయం తీసుకునే అధికారం కేవలం స్పీకర్ కే ఉంది. గత సుప్రీంకోర్టు తీర్పులు కూడా ఇదే అంశాన్ని చెబుతున్నాయి. స్పీకర్‌కు ఫిర్యాదు చేసిన వెంటనే....పిటీషనర్లే దురుద్దేశపూర్వకంగా కోర్టును ఆశ్రయించారు. ఫిరాయింపులపై స్పీకర్ నిర్ణయం తీసుకోవడం లేదన్నది సరికాదని.. చట్ట ప్రకారమే నడుచుకుంటున్నామని.. కాబట్టి ఈ పిటిషన్లను డిస్మిస్ చేయాలి'' అని కోరారు.

నోటీసులు ఇచ్చామని స్పీకర్ అంటున్నారు.. కానీ, ఆ కాపీలు మాకు అందజేయలేదు

స్పీకర్ అధికారాలు సైతం న్యాయసమీక్ష పరిధిలోనే ఉంటాయి

న్యాయ సమీక్షకు స్పీకర్ అతీతులు కాదు

ఫిరాయింపులపై స్పీకర్ నిర్ణయంపై నిర్దిష్టమైన గడువు విధించాలి

నాలుగు వారాల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకునేలా ఆదేశించాలి

ఈక్రమంలో స్పందించిన జస్టిస్ గవాయ్.. పార్టీ ఫిరాయింపులకు వార్షికోత్సవం అయిందా? అని వ్యాఖ్యానించారు. అయితే ఇలాంటి వ్యవహారాల్లో గతంలో రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పులు ఉన్నప్పటికీ.. ఎప్పటిలోగా తేల్చాలనే విషయంపైనే స్పష్టత కొరవడిందని జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం వ్యాఖ్యానించింది. అలాంటప్పుడు ఆ తీర్పును కాదని ఎలా ముందుకు వెళ్లగలమని చెప్పింది. ఉన్నత ధర్మాసనాల తీర్పులను ఎలా తిరిగి రాయగలమని ప్రశ్నించింది. ధర్మాసనం ఇంకా ఏమందంటే..

**బీఆర్ఎస్ వాదనలు.. కీ పాయింట్స్**

- 2024 మార్చి 18న మొదట ఫిరాయింపులపై శాసనసభ స్పీకర్ ఫిర్యాదు చేశాం
- మొదటి ఫిర్యాదు చేసినా నోటీసులు ఇవ్వలేదు
- హైకోర్టుకు వెళ్లేంత వరకు కూడా నోటీసులు ఇవ్వలేదు
- రీజనబుల్ టైంలోనే చర్యలు తీసుకోవాలని హైకోర్టు డివిజన్ బెంచ్ చెప్పింది
- హైకోర్టు చెప్పినా ఎలాంటి చర్యలు లేవు
- దానం నాగేందర్‌పై ఫిర్యాదు చేసినా.. ఆయనకు నోటీసులు ఇవ్వలేదు
- దానం ఎంపీగా పోటీ చేసినా చర్యల్లేవ్

**కడియంకు వ్యతిరేకంగా సాక్ష్యాలు ఉన్నా.. చర్యలు లేవ్**

- అనర్హత పిటిషన్ విచారణపై షెడ్యూల్ చేయాలని.. హైకోర్టు నాలుగు వారాల గడువు ఇచ్చింది
- స్పీకర్ 7 రోజుల సమయం ఇస్తూ నోటీసులు ఇచ్చారు
- ముగ్గురు ఎమ్మెల్యేలు ఒకేరకంగా సమాధానం ఇచ్చారు

కారు గుర్తుపై గెలిచి పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలపై చర్యలు చేపట్టేలా స్పీకర్‌కు ఆదేశాలివ్వాలని కోరుతూ బీఆర్ఎస్ పార్టీ జనవరిలో సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావ్, దానం నాగేందర్‌లపై స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు అయ్యింది. పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎం.సంజయ్‌కుమార్, కాలె యాదయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, గూడెం మహిపాల్ రెడ్డి, అరికెపూడి గాంధీలపై రిట్ పిటిషన్ దాఖలైంది. వీటిపై ఇప్పటికే పలుమార్లు విచారణ జరిపింది సుప్రీం కోర్టు. కేటీఆర్, పాడి కౌశిక్‌రెడ్డి, ఇతర బీఆర్ఎస్ నేతలు ఈ పిటిషన్లు వేశారు. అయితే..

**ఎమ్మెల్యేలకు నోటీసులు ఇవ్వడానికి ఇంకా ఎంత కాలం పడుతుంది?: ధర్మాసనం**

- ఆలస్యం చేసే ఎత్తుగడలు అనుసరించొద్దు
- ఎమ్మెల్యేల ఫిరాయింపులపై ఫిర్యాదు వచ్చి ఎంతకాలమైంది?
- రీజనబుల్ టైం అంటే గడువు ముగిసే వరకా?
- మొదటి ఫిర్యాదు చేసినప్పటి నుంచి ఇప్పటిదాకా ఎంత టైం గడిచింది.
- నాలుగు వారాలైనా షెడ్యూల్ ఫిక్స్ చేయలేదా?
- అదృష్టవశాత్తూ.. ఎమ్మెల్యేలు 4 ఏళ్లు ఆగలేదు
- మూడు వారాల సమయం విషయంలో మాత్రం స్పీకర్ రీజనబుల్‌గా ఉన్నారు
- తెలంగాణ హైకోర్టు సింగిల్ బెంచ్ జడ్జి ఇచ్చిన తీర్పులో డివిజన్ బెంచ్ జోక్యం సరైందో కాదో చూస్తాం?
- కౌంటర్ దాఖలుకు ప్రతివాదులు మరింత సమయం కోరగా.. కాలయాపన చేసే విధానాలు మానుకోవాలి బెంచ్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇవాళ బీఆర్ఎస్ తరపున వాదనలు ముగియడంతో తదుపరి విచారణను ఏప్రిల్ 2వ తేదీకి వాయిదా వేసింది. ఆరోజు స్పీకర్ తరపున ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించనున్నారు.

ఈ పిటిషన్లకు సంబంధించి.. కొద్దిరోజుల క్రితం మహిపాల్‌రెడ్డి, తాజాగా బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సుప్రీం కోర్టులో అఫిడవిట్‌లు దాఖలు చేశారు. తాము బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతున్నామని, పార్టీ ఫిరాయింపు ఆరోపణల్లో వాస్తవం లేదని అందులో పేర్కొన్నారు. కేవలం ఎమ్మెల్యే హోదాలోనే సీఎంను కలిశామని తెలిపారు. అందువల్ల తమపై దాఖలైన కేసులను కొట్టివేయాలని అభ్యర్థించారు. బీఆర్ఎస్‌కు తాము రాజీనామా చేయలేదని.. కాంగ్రెస్ పార్టీలో ఎప్పుడూ చేరలేదని.. మీడియాలో వచ్చిన వార్తలలో నిజం లేదని.. కాబట్టి ఈ అనర్హత పిటీషన్లకు విచారణ అర్హత లేదని వాటిల్లో పేర్కొన్నారు. ఈ మేరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో ఉన్న ఫొటోలు, పోస్టర్లను, తమ ఫొటోలతో కూడిన పార్టీ ఫ్లెక్సీల ఫొటోలనూ అఫిడవిట్‌లో జత చేశారు.

ఇప్పటికే ఈ కేసు విచారణలో సర్వోన్నత న్యాయస్థానం ఆసక్తికర వ్యాఖ్యలు చేస్తూ వస్తోంది. గతంలో తెలంగాణ స్పీకర్‌పై తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. తగినంత సమయం అంటే ఎంతో చెప్పాలని కోరింది. గత విచారణలో.. ఆపరేషన్ సక్సెస్ , పేషంట్ డెడ్ అనే తీరు సరికాదన్న పేర్కొంది.

# ముందే లీక్..
# మరీ ఇంత నిర్లక్ష్యమా?



**మొదటి పేజీ తరువాయి**

యుద్ధానికి సమాచారం పోస్ట్ చేశారు. 'ద అట్లాంటిక్' మ్యాగజైన్ ఎడిటర్ ఇన్ చీఫ్ జెఫ్రీ గోల్డ్‌బర్గ్ స్వయంగా ఈ విషయం తెలియజేశారు.

మార్చి 15వ తేదీన యెమెన్‌పై దాడులను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. కానీ, అంతకంటే ముందే సిగ్నల్‌లోని గ్రూప్‌చాట్ ద్వారా తనకు నోటీసు అందిందని తెలిపారు. ఈ ఘటన జరిగిన రెండ్రోజుల ముందే ఆయన్ని ఆ గ్రూప్‌లో యాడ్ చేశారట!. అయితే అవకాశం ఉన్నా.. ఆయన ఆ సమాచారాన్ని పబ్లిష్ చేయలేదు.

జెఫ్రీ ప్రకటన తర్వాత విషయం ధృవీకరించుకున్న వైట్‌హౌజ్ అధికారులు నాలిక కర్చుకున్నారు. ఈ విషయంలో పొరపాటు జరిగిన మాట వాస్తవమేనని సోమవారం వైట్‌హౌజ్ వర్గాలు ధృవీకరించాయి. అయితే ఎలాంటి దాడులు జరపుతామనే ప్రణాళిక అందులో ప్రస్తావించలేదని పేర్కొన్నాయి. ఈ వ్యవహారం ఇప్పుడు అక్కడ చర్చనీయాంశంగా మారింది.

# నీతీశ్ ఆరోగ్య పరిస్థితి వెల్లడించాలి



**మొదటి పేజీ తరువాయి**

ఆయన కేబినెట్ మిత్రుల పేర్లు కూడా మరచిపోతున్నారు. పర్యటనలు చేస్తున్నప్పుడు ఆయన ఏ జిల్లాలో ఉన్నారో కూడా గుర్తించుకోవడం లేదు. ఇటీవల బీపీఎస్‌సీ పరీక్షలపై జరిగిన ఆందోళనల సమయంలో.. రాష్ట్రంలో ఏం జరుగుతుందనేది ఆయనకు తెలియదనే విషయం నాకు తెలిసింది'' అని ప్రశాంత్ కిశోర్ పేర్కొన్నారు. ఆయన ఆరోగ్యంపై మెడికల్ బులెటిన్ విడుదల చేస్తే ప్రజలకు వాస్తవాలు తెలుస్తాయన్నారు. అయితే, అలాంటి వాటికి సీఎం అస్సలు అంగీకరించరని పీకే పేర్కొన్నారు.

**ఆర్మీ 'ఎయిర్‌క్రాఫ్ట్' హ్యాక్..**
**ఇందులో నిజమెంత?**

ముఖ్యమంత్రి నీతీశ్ మానసిక ఆరోగ్యంపై ఆయన సన్నిహితుడు సుశీల్ మోదీ 2023లో మొదటిసారి ఆందోళన వ్యక్తం చేశారని ప్రశాంత్ కిశోర్ పేర్కొన్నారు. గత రెండేళ్లుగా బిహార్ ప్రజలు కూడా ఆయన తీరును గమనిస్తూనే ఉన్నారన్నారు.




# జూన్ నుంచి యూపీఐ, ఏటీఎం ద్వారా పీఎఫ్ విత్‌డ్రా

**మొదటి పేజీ తరువాయి**

ద్వారా తెలిపారు. ఈ ఏడాది మే లేదా జూన్ నుంచి ఉద్యోగులు పీఎఫ్ మొత్తాలను ఏటీఎం, యూపీఐ ద్వారా విత్‌డ్రా చేసుకునే సదుపాయం అందుబాటులోకి రానుందని వెల్లడించారు.

ఈ మేరకు ఓ వార్తా సంస్థతో ఆమె మాట్లాడారు. ప్రావిడెండ్ ఫండ్స్ నిధులు పొందే విషయంలో చందాదారులు అనూహ్య మార్పులు చూడబోతున్నారని తెలిపారు. కేవలం నగదు విత్‌డ్రా మాత్రమే కాకుండా.. పీఎఫ్‌లో ఎంత మొత్తం ఉందో కూడా యూపీఐ ద్వారా చూసుకోవచ్చని చెప్పారు. ఆటోమేటెడ్ సిస్టమ్ విధానంలో 1 లక్ష రూపాయల వరకు విత్‌డ్రా చేసుకోవచ్చని చెప్పారు. కోరుకున్న అకౌంట్‌కు ఆ నగదును బదిలీ చేసుకోవచ్చని పేర్కొన్నారు.

**అమ్మకాల్లో టెస్లాను దాటేసిన బీవైడీ..!**

డిజిటలైజ్ చేయడంలో ఈపీఎఫ్ఓ గణనీయమైన పురోగతి సాధించిందని దావ్రా పేర్కొన్నారు. విత్‌డ్రా సదుపాయాన్ని క్రమబద్ధీకరించడానికి 120కి పైగా డేటాబేస్‌లను ఏకీకృతం చేసిందని తెలిపారు. అంతేకాకుండా క్లెయిమ్ ప్రాసెసింగ్ సమయం కూడా కేవలం 3 రోజులకు తగ్గిందని చెప్పారు. 95 శాతం క్లెయిమ్‌లు ఆటోమేటెడ్ ప్రాసెస్ రూపంలో జరుగుతున్నాయని తెలిపారు. యూపీఐ, ఏటీఎం ద్వారా పీఎఫ్ విత్ డ్రా ఆప్షన్ అనేది ఒక మైలురాయి అని, లక్షలాది మంది ఉద్యోగులకు దీనివల్ల ప్రయోజనం కలగనుందని చెప్పారు.

# గచ్చిబౌలి ఘరానా మోసం నిందితుడి అరెస్టు

**కోయంబత్తూరు లో అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :** బంగారం బిస్కెట్లు, డాలర్లతో వ్యాపారులను మోసగించి ఉడాయించిన నింధితుడిని సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ నెల 21వ తేదీన దోపిడీ చేసిన నిందితుడి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టిన పోలీసులు కోయంబత్తూరు లో నిందితుడి ని అరెస్టు చేశారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలోని డిఎల్ఎఫ్ సమీపంలో ఓ హోటల్ లో నగర వ్యాపారులు చంద్రశేఖర్, రఫి లను కలిసిన నిందితుడు వారికి మాయమాటలు చెప్పి 500 గ్రాముల బంగారు బిస్కెట్లు, 18వేల అమెరికన్ డాలర్లతో ఉడాయించిన విషయం తెలిసిందే. వ్యాపారుల పిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న గచ్చిబౌలి పోలీసులు నిందితుడి ఆచూకీ కోసం ముమ్మరంగా గాలింపు చేపట్టారు. కాగా కారు అద్దెకు తీసుకున్న సమయంలో నిందితుడు ఇచ్చిన ఆధార్ కార్డు నకిలీదని తేలడంతో నిందితుడి కోసం ఇతర రాష్ట్రాల్లో గాలింపు చేపట్టారు. ఈ మేరకు నిందితుడిని కోయంబత్తూరు కు చెందిన పగులు హసన్ గా గుర్తించిన గచ్చిబౌలి పోలీసులు నిందితుడిని మంగళవారం కోయంబత్తూరు లో అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు నిందితుడిని అరెస్టు చేసి నగరానికి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నారు.





కొత్త కుంట చెరువును పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

# ఖాజాగూడ కొత్త కుంట చెరువును పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్

**చెరువులో పోసిన మట్టిని తొలగించాలని వంశీ రామ్ సంస్థకు ఆదేశం**

**ఈ-కబురు, శేరిలింగంపల్లి** : శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని ఖాజాగూడలో గల కొత్త కుంట చెరువును మంగళవారం రాత్రి హైడ్రా కమిషనర్ ఏవి. రంగనాథ్ పరిశీలించారు. శేరిలింగంపల్లి మండల పరిధిలోని ఖాజాగూడ సర్వే నెంబర్ 5లో గల కొత్త కుంట చెరువు కబ్జాకు గురవుతుందని గతంలో స్థానికులు హైడ్రా కమిషనర్ కు పిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన హైడ్రా కమిషనర్ గతంలోనే ఈ చెరువును పరిశీలించారు. కాగా కొత్త కుంట ఎఫ్టీఎల్ పరిధిలో నిర్మాణాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో మంగళవారం రాత్రి ఖాజాగూడకు వచ్చిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ క్షేత్ర స్థాయిలో చెరువు పరిస్థితిని పరిశీలించారు. ఈ చెరువు కొన్ని రోజుల క్రితం ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సైతం హైడ్రాకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. చెరువు బఫర్ జోన్, శిఖం స్థలాల్లో వంశీరాం సంస్థ మట్టిని నింపినట్టు గుర్తించిన రంగనాథ్ వంశీరామ్ బిల్డర్స్ తో మాట్లాడి చెరువులో వేసిన మట్టిని మూడు, నాలుగు రోజుల్లో తొలగించాలని ఆదేశించారు. లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీనితో పాటు చెరువు ఎఫ్ టీ ఎల్ పరిధి తెలుసుకునేందుకు జాయింట్ ఇని స్పెక్షన్ చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. కాగా చెరువులో పోసిన మట్టిని రెండు, మూడు రోజుల్లో తొలగిస్తామని ఈ సందర్భంగా వంశీరాం బిల్డర్స్ కమిషనర్ కు హామీ యిచ్చారు.



ఎంపీ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేస్తున్న భాస్కర్ రెడ్డి తదితరులు

## భవానీపురం కాలనీ సమస్యలు పరిష్కరించాలని ఎంపీ విశ్వేశ్వరరెడ్డికి వినతి

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :** శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని చందానగర్ డివిజన్ భవానిపురం కాలనీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డికి కాలనీవాసులు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. బిజెపి రాష్ట్ర నాయకులు, జనం కోసం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు భవానీపురం కాలనీవాసి కసిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో కాలనీవాసులు మంగళవారం ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి కార్యాలయానికి వెళ్లారు. విశ్వేశ్వర్ రెడ్డి అందుబాటులో లేకపోవడంతో ఫోన్లో కాలనీ సమస్యలను కసిరెడ్డి భాస్కర్ రెడ్డి వివరించారు. విశ్వేశ్వర్ రెడ్డి సూచన మేరకు ఎంపీ వ్యక్తిగత సహాయకుడు విక్రమ్ కు వినతి పత్రాన్ని అందజేశారు. భవానిపురం కాలనీలో రహదారులు, డ్రైనేజీ కాలువల సమస్యలు పరిష్కరించాలని, నాలా నిర్మాణం చేపట్టాలని, కాలనీలో పార్కులను అభివృద్ధి చేయాలని కోరారు. ఈ విషయమే సానుకూలంగా స్పందించిన ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్వశ్రీ, టి రఘునందన్ రెడ్డి, లక్ష్మీకాంత్ రెడ్డి, పర్వత రెడ్డి, సందీప్, కె.వి. రాఘవులు, ప్రకాష్ రావు, దయాకర్ రెడ్డి, విజయ సారథి, శివన్న తదితరులు పాల్గొన్నారు.

## 'దేవుళ్లని మోసం చేసిన రేవంత్‌కు రైతులను మోసం చేయడం ఓ లెక్క'



**ఈ కబురు మెదక్ జిల్లా :** దేవుళ్లను మోసం చేసిన సీఎం రేవంత్ రెడ్డికి రైతులను మోసం చేయడం ఓ లెక్క' అని మాజీ మంత్రి హరీష్ రావు విమర్శలు గుప్పించారు.

మెదక్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో హరీష్ రావు మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు. అధికారంలోకి వచ్చినా మొదటి రోజే రూ 2లక్షలు చేస్తామని చేతులెత్తేశారు. దేవుళ్లను మోసం చేసిన రేవంత్‌కు రైతులను మోసం చేయడం ఓ లెక్క.

రైతులతో మిత్తిలు కట్టించి రుణాలు ఇవ్వలేదు. మొదటి ఏడాదిలో 2లక్షల ఉద్యోగాలు ఇస్తామని రేవంత్ సర్కార్ మోసం చేసింది. అన్ని వర్గాలను ప్రభుత్వం దారుణంగా మోసం చేసింది. అసెంబ్లీలో మేము అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ముఖం చాటేసిందది.

రూ 2లక్షల రుణమాఫీ మీద రైతులు కాంగ్రెస్ నేతలను నిలదీయండి. రైతుబందు ఎగ్గొట్టింది. కరోనా కష్ట కాలంలో కూడా కేసీఆర్ రైతు బంధు అందించారు. కాంగ్రెస్ మాటలే తప్ప చేతలు లేవు. ఉద్యోగులకు పెన్షన్లు ఇవ్వడం లేదు. సర్పంచులకు, చిన్న కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వడం లేదు. సంపూర్ణ రుణమాఫీ అయ్యేదాకా రైతుల పక్షాన నిలదీస్తాం' అని హరీష్ రావు స్పష్టం చేశారు.



# ..ఇప్పుడు మీ పార్టీలో ఉన్నారు'

**మొదటి పేజీ తరువాయి**

విడుదల కాలేదు. మన ఊరు మన బడి పథకంలో బెంచీల కొనుగోళ్లలో స్కాం జరిగింది. ఈ స్కాం పై ప్రశ్న వేద్దాం అనుకుంటే ప్రశ్నోత్తరాలు రద్దు చేస్తున్నారు. రూ. 14, రూ. 18, రూ. 20వేల ఒక్కో బెంచ్ కొన్నారు. రూ. 5వేలకు ఒక బెంచ్ వస్తది...20వేల పెట్టీ కొన్నారు.

బెంచీల కొనుగోళ్ల పై ఈ ప్రభుత్వం విచారణ చేయించాలి.నేను పేర్లు చెప్పలేని...కాళేశ్వరం కంటే పెద్ద స్కాం. నిధులను లూటీ చేశారు.. 32లక్షల బెంచీలను కొనుగోలు చేశారు. పెద్ద స్కాం చేశారు. దానికి సంబంధించి ఒకరు అప్పుడు BRS తో ఉన్నారు...ఇప్పుడు మీ పార్టీలో ఉన్నారు' అని అక్బరుద్దీన్ విమర్శించారు.

## మా ఎన్నికల్లో భారత్ జోక్యం చేసుకునే అవకాశం..
# మళ్లీ నోరుపారేసుకున్న కెనడా

**కెనడాలో ఏప్రిల్‌లో జరిగే ఎన్నికల్లో భారత్, చైనా జోక్యం చేసుకునే అవకాశాలున్నాయంటూ ఆ దేశ స్పై ఏజెన్సీ సంచలన ఆరోపణలు చేసింది.**




**ఈ కబురు :** భారత్‌కెనడాల మధ్య దౌత్య వివాదం కొనసాగుతున్న వేళ ఒట్టావా మరోసారి న్యూదిల్లీపై నోరు పారేసుకుంది. కెనడాలో త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో భారత్, చైనా జోసుకునే అవకాశం ఉందని ఆ దేశ స్పై ఏజెన్సీ ఆరోపించింది. రష్యా, పాకిస్థాన్ కూడా ఆ ప్రయత్నం చేయొచ్చని అనుమానాలు వ్యక్తంచేసింది.

కెనడియన్ సెక్యూరిటీ ఇంటెలిజెన్స్ సర్వీస్ డిప్యూటీ డైరెక్టర్ వానెస్సా లాయిడ్ మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ''త్వరలో మా దేశంలో జరగబోయే ప్రజాస్వామ్య ప్రక్రియలో జోక్యం చేసుకునేందుకు శత్రు దేశ నాయకులు కృత్రిమ మేధ సాధనాలను ఎక్కువగా ఉపయోగించుకుంటున్నట్లు మాకు సమాచారం ఉంది. చైనా ప్రభుత్వం ఈ ప్రయత్నాలు చేసేందుకు అధిక అవకాశాలు ఉన్నాయి. భారత ప్రభుత్వానికి కూడా ఆ సామర్థ్యం, ఉద్దేశం ఉంది'' అని లాయిడ్ ఆరోపించారు. అయితే, ఈ ఆరోపణలపై ఒట్టావాలోని చైనీస్, భారత దౌత్య కార్యాలయాలు ఇంకా స్పందించలేదు.

వలసదారుల ప్రయాణాలపై అమెరికా నజర్.. గ్రీన్‌కార్డు, హెచ్ 1బీపై ఉన్న భారతీయులకు అలర్ట్

కాగా.. గతంలో కెనడా ఇలాంటి ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. కెనడా ఎన్నికల్లో విదేశీ ప్రభుత్వాల జోక్యం అంటూ వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు నిమిత్తం ఆ దేశ ప్రభుత్వం ఓ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఆ కమిషన్ ఇచ్చిన నివేదికలో న్యూదిల్లీపై తీవ్ర ఆరోపణలు చేసింది. ''ఫెడరల్ ఎన్నికల్లో పోటీ చేసిన మూడు రాజకీయ పార్టీల నాయకులకు భారత ప్రభుత్వం ప్రాక్సీ ఏజెంట్ల ద్వారా రహస్యంగా ఆర్థిక సాయం అందించినట్లు తెలుస్తోంది'' అని కెనడియన్ కమిషన్ పేర్కొంది. దీన్ని భారత విదేశాంగ శాఖ తీవ్రంగా ఖండించింది. వాస్తవానికి భారత అంతర్గత వ్యవహారాల్లో కెనడానే జోక్యం చేసుకుంటోందని, దీనివల్ల మన దేశంలో అక్రమ వలసలు, వ్యవస్థీకృత నేర కార్యకలాపాలు చోటుచేసుకుంటున్నాయని మండిపడింది.

2023 జూన్‌లో ఖలిస్థానీ ఉగ్రవాది నిజ్జర్ కెనడాలో హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ హత్యలో భారత ఏజెంట్ల పాత్ర ఉందంటూ ఆ దేశ ప్రధాని జస్టిన్ ట్రూడో చేసిన ఆరోపణలతో ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు దెబ్బతిన్నాయి. వాటిని న్యూదిల్లీ తీవ్రంగా ఖండించింది. దీనిపై ఇరుదేశాల మధ్య ప్రతిష్టంభన కొనసాగుతుండగానే.. కెనడా పదేపదే న్యూదిల్లీపై ఆరోపణలు చేస్తూనే ఉంది. ఇదిలాఉండగా.. కెనడా నూతన ప్రధానిగా ఇటీవల ప్రమాణ స్వీకారం చేసిన మార్క్ కార్నీ ముందస్తు ఎన్నికలకు సిద్ధమయ్యారు. ఏప్రిల్ 28న అక్కడ సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి.



# కోడింగ్‌లో కృత్రిమమేధ ఏం చేస్తుందంటే..

**ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌లో విప్లవాత్మక మార్పులు తీసుకుస్తోంది. కోడింగ్ ప్రక్రియలో సృజనాత్మకతను, సామర్థ్యాన్ని సమకూరుస్తోంది. కోడింగ్‌లో ఏఐ నిర్వహిస్తున్న కొన్ని అంశాలను సాంకేతిక నిపుణులు విశ్లేషిస్తున్నారు.**

**కోడ్ జనరేషన్:** గిట్‌హాబ్ లాంటి కోపిలాట్ కృత్రిమ మేధ ఆధారిత సాధనాలు నేచురల్ ల్యాంగ్వేజీ వివరణల ఆధారంగా కోడ్ స్నిప్పెట్లు, ఫంక్షన్లు, మాడ్యూల్‌స్‌ను తయారు చేస్తుంది. ఇది మాన్యువల్ కోడింగ్‌ను తగ్గించి సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌ను వేగవంతం చేస్తుంది.

**బగ్ డిటెక్షన్:** ఏఐ అల్గారిథమ్స్ నమూనాలను విశ్లేషించడం ద్వారా కోడ్‌లో బగ్స్, సమస్యలను గుర్తిస్తున్నారు. ఈ టూల్స్ రియల్ టైమ్ ఫీడ్ బ్యాక్‌ను అందిస్తాయి.

**కోడ్ ఆప్టిమైజేషన్:** ఏఐ ఇప్పటికే ఉన్న కోడ్‌ను విశ్లేషించగలదు. పనితీరు, రీడబిలిటీ, నిర్వహణను మెరుగుపరచడానికి ఆప్టిమైజేషన్‌లను సూచిస్తుంది. ఇది వనరులను సమర్థవంతంగా ఉపయోగించడానికి, మెరుగైన సాఫ్ట్‌వేర్‌ను రూపొందించడానికి సాయం చేస్తుంది.


**టెస్టింగ్:** టెస్ట్ కేసులను జనరేట్ చేయడం, ఎడ్జ్ కేసులను గుర్తించడం, పునరావృత టెస్టింగ్ పనులను ఆటోమేట్ చేయడం ద్వారా ఏఐ టెస్టింగ్ ప్రక్రియను క్రమబద్ధీకరిస్తుంది.

**కోడ్ రివ్యూ అసిస్టెన్స్:** ఏఐ ఆధారిత కోడ్ రివ్యూ టూల్స్ పీర్ రివ్యూల సమయంలో కోడ్‌ను మెరుగుపరచడానికి, కోడింగ్ ప్రమాణాలు, ఉత్తమ పద్ధతులకు కట్టుబడి ఉండేలా చూడటానికి సూచనలను అందిస్తాయి

**డీబగ్గింగ్ సపోర్ట్:** కోడింగ్‌లో సమస్యలకు మూల కారణాన్ని గుర్తించడం, సంభావ్య పరిష్కారాలను సూచించడం ద్వారా డీబగ్గింగ్ చేయడంలో ఏఐ టూల్స్ డెవలపర్లకు సహాయపడతాయి. ట్రబుల్ షూటింగ్ కోసం వెచ్చించే సమయాన్ని తగ్గిస్తాయి.

**లెర్నింగ్ అండ్ అప్ స్కిల్లింగ్:** ఇంటరాక్టివ్ ట్యుటోరియల్స్‌ను సిఫార్సు చేయడం ద్వారా డెవలపర్లు కొత్త ప్రోగ్రామింగ్ ల్యాంగ్వేజీలు, ఫ్రేమ్ వర్క్‌లను నేర్చుకోవడానికి ఏఐ తోడ్పడుతుంది.

**అనాలిసిస్:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ చారిత్రాత్మక డేటాను విశ్లేషించడం ద్వారా ప్రాజెక్ట్ టైమ్ లైన్లు, వనరుల అవసరాలు, సంభావ్య ప్రమాదాలను అంచనా వేయగలదు.



# ఆదాయపు పన్ను బిల్లుపై వర్షా కాల సమవేశాల్లో చర్చలు

**లోక్‌సభలో కేంద్రబడ్జెట్ 2025-26 సమయంలో ప్రవేశపెట్టిన ఆదాయపు పన్ను బిల్లుపై పార్లమెంట్ వర్షా కాల సమావేశాల్లో చర్చ జరుగుతుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ట్యాక్సేషన్‌కు సంబంధించి ప్రస్తుతం ఉన్న మదింపు సంవత్సరం, అంతకు ముందు సంవత్సరం..వంటి నిబంధనలను విలీనం చేస్తూ పన్ను సంవత్సరం అనే ఏకీకృత భావనను ఈ బిల్లులో ప్రవేశపెట్టనున్నారు.**

ఈ బడ్జెట్ సమావేశాల్లో ఫైనాన్స్ బిల్లు ద్వారా కొన్ని నిబంధనలు, సంస్కరణ చర్యలను ప్రవేశపెట్టామని, వర్షాకాల సమావేశాల్లో ఇవి చర్చకు వస్తాయని ఆశిస్తున్నట్లు నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. పన్ను చెల్లింపుదారులకు ప్రయోజనం చేకూర్చేలా పన్ను వ్యవస్థను హేతుబద్ధీకరించడం ద్వారా భారతదేశ ఆకాంక్షలను నెరవేర్చడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. సులభతర వ్యాపారాన్ని ప్రోత్సహించడానికి, ఆర్థిక బిల్లు వివిధ నిబంధనలను హేతుబద్ధీకరిస్తుంది. వీటిలో పన్ను మినహాయించబడిన మూలం (టీడీఎస్), పన్ను సేకరించిన మూలం (టీసీఎస్) నిబంధనలపై పరిమితులను తగ్గించడం వంటివి ఉన్నాయి.

విలీన కాలాన్ని ఐదేళ్లు పొడిగించడం వల్ల స్టార్టప్‌లు కూడా ప్రయోజనం పొందుతాయని నిర్మలా సీతారామన్ తెలిపారు. విలీన కాలం అనేది ఒక కంపెనీ అధికారికంగా స్థాపించబడి చట్టబద్ధ సంస్థగా నమోదు చేసేందుకు పట్టే సమయాన్ని సూచిస్తుంది. ఫైనాన్స్ బిల్లు 2025 సవరణలలో భాగంగా ఆన్‌లైన్ ప్రకటనలపై 6 శాతం ఈక్వలైజేషన్ లెవీని తొలగించాలని ప్రభుత్వం ప్రతిపాదించిందని మంత్రి తెలిపారు. దేశీయ ఉత్పత్తిని పెంచే లక్ష్యంతో బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించిన కస్టమ్ డ్యూటీ నిర్మాణాల హేతుబద్ధీకరణ, కోతలను ఆమె పునరుద్ఘాటించారు. కస్టమ్స్ హేతుబద్ధీకరణ వల్ల దిగుమతిదారులకు కూడా ప్రయోజనం కలుగుతుందన్నారు. రెండో విడత బడ్జెట్ సమావేశాలు ఏప్రిల్ 4న ముగియనున్నాయి.

# హైదరాబాద్‌లో పడిపోయిన ఇళ్ల అమ్మకాలు

**జనవరి–మార్చి మధ్య 47 శాతం డౌన్**

**టాప్ 9 నగరాల్లో 23 తగ్గిన విక్రయాలు ఆర్థిక వృద్ధిపై ఆందోళనలు, బలహీన డిమాండ్ ప్రభావం ప్రాప్ ఈక్విటీ సంస్థ నివేదికలో వెల్లడి**

**న్యూఢిల్లీ:** హైదరాబాద్ సహా దేశవ్యాప్తంగా ప్రముఖ నగరాల్లో ఇళ్ల అమ్మకాలు పడిపోయాయి. జనవరి-మార్చి కాలంలో హైదరాబాద్‌లో 11,114 యూనిట్ల ఇళ్ల అమ్మకాలు నమోదవుతాయని రియల్ ఎస్టేట్ డేటా విశ్లేషణ సంస్థ ప్రాప్ ఈక్విటీ అంచనా. క్రితం ఏడాది తొలి మూడు నెలల కాలంలోని అమ్మకాలు 20,835 యూనిట్లతో పోల్చి చూస్తే 47 శాతం తగ్గనున్నాయి.

ఇలా దేశవ్యాప్తంగా టాప్ 9 నగరాల్లో మార్చి త్రైమాసికంలో ఇళ్ల అమ్మకాలు 23 శాతం తక్కువగా 1,05,791 యూనిట్లుగా ఉండొచ్చని అంచనా వేసింది. క్రితం ఏడాది మొదటి మూడు నెలల్లో ఈ నగరాల్లో అమ్మకాలు 1,36,702 యూనిట్లుగా ఉన్నాయి. అధిక ధరలతో డిమాండ్ బలహీనపడడం, ఆర్థిక వృద్ధిపై ఆందోళనలు విక్రయాలు పడిపోవడానికి కారణాలుగా ప్రాప్ ఈక్విటీ తన నివేదికలో పేర్కొంది.

తొమ్మిది నగరాల్లో ఢిల్లీ ఎన్‌సీఆర్, బెంగళూరు మాత్రం వృద్ధిని చూసినట్టు తెలిపింది. ''మూడేళ్లపాటు రికార్డు స్థాయి సరఫరా అనంతరం హౌసింగ్ మార్కెట్లో దిద్దుబాటు చోటుచేసుకుంది. అమ్మకాలు తగ్గుముఖం పట్టడమే ఇందుకు కారణం. కొత్త ఇళ్ల సరఫరా సైతం జనవరి-మార్చి మధ్య 34 శాతం క్షీణించి 80,774 యూనిట్లకు పరిమితం కావచ్చు. క్రితం ఏడాది మొదటి త్రైమాకంలో సరఫరా 1,22,365 యూనిట్లుగా ఉంది. ఇళ్ల ధరలు పెరగడం, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, దేశ ఆర్థిక వ్యవస్థలో కొంత బలహీనత అమ్మకాలు తగ్గడానికి కారణాలుగా ఉన్నాయి''అని ప్రాప్ ఈక్విటీ వ్యవస్థాపకుడు, సీఈవో సమీర్ జసూజ తెలిపారు.



**పట్టణాల వారీగా విక్రయ అంచనాలు..**

- బెంగళూరులో జనవరి-మార్చి మధ్య విక్రయాలు 18,508 యూనిట్లుగా ఉండొచ్చు. క్రితం ఏడాది తొలి క్వార్టర్‌లో అమ్మకాలు 16, 768 యూనిట్లతో పోల్చితే 10%పెరుగుతాయి.
- ఢిల్లీ ఎన్‌సీఆర్ మార్కెట్లోనూ 10 శాతం వృద్ధితో 11,221 యూనిట్ల అమ్మకాలు నమోదు కావచ్చు.
- చెన్నైలో 4,858 యూనిట్లు అమ్మడు కావచ్చు. క్రితం ఏడాది ఇదే కాలంలో విక్రయాలు 4,962 యూనిట్లతో పోల్చి చూస్తే 2 శాతం క్షీణించే అవకాశం ఉంది.
- కోల్‌కతాలో 28 శాతం తక్కువగా 4,219 యూనిట్ల విక్రయాలు నమోదవ్వొచ్చు.
- ముంబై మార్కెట్లో 10,432 యూనిట్లు అమ్ముడుపోవచ్చు. క్రితం ఏడాది ఇదే కాలంలో విక్రయాలు 16,204 యూనిట్లుగా ఉన్నాయి.
- నవీ ముంబైలో 7 శాతం తక్కువగా 8,551 యూనిట్లకు పరిమితం కావొచ్చు.
- పుణెలోనూ అమ్మకాలు 33 శాతం తక్కువగా 17,634 యూనిట్లుగా ఉంటాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో అమ్మకాలు 26,364 యూనిట్లుగా ఉన్నాయి.
- థానేలో 27 శాతం క్షీణతతో అమ్మకాలు 19,254 యూనిట్లుగా ఉంటాయి.

# విద్యుత్ వాడుతూ.. మిగిలింది అమ్ముతూ..

**ఉగ్నే హువాన్, రోహిత్ వడేరా, వి. కె.సారస్వత్, నిశాంత్ దొంగరి మార్కెట్‌లోకి 'ప్యూర్' ఎనర్జీ స్టోరేజీ సొల్యూషన్స్ ఉత్పత్తులు**




**హైదరాబాద్:** ఎలక్ట్రిక్ టూవీలర్స్ తయారీ సంస్థ ప్యూర్ సరికొత్త రంగంలోకి అడుగుపెట్టింది. ఇళ్లతోపాటు, వాణిజ్య, గ్రిడ్‌స్థాయిలో ఉపయోగపడే ఎనర్జీ స్టోరేజీ సొల్యూషన్స్ (విద్యుత్తును నిల్వ చేసుకుని అవసరానికి తగ్గట్టుగా వాడుకునేందుకు వీలు కల్పించే) ఉత్పత్తులను 'ప్యూర్‌పవర్ ' పేరుతో మార్కెట్‌లోకి తెచ్చింది. ఇవి సాధారణ యూపీఎస్‌లలో మాదిరిగా వీటిల్లో లెడ్ ఆక్సైడ్ బ్యాటరీలు కాకుండా.. అత్యాధునిక లిథియంఅయాన్ బ్యాటరీలు ఉండటం ఒక ప్రత్యేకతైతే.. సౌర విద్యుత్తు లాంటి సంప్రదాయేతర ఇంధన వనరులతో ఉత్పత్తి అయ్యే విద్యుత్తును కూడా ఎటువంటి అదనపు పరికరాల అవసరం లేకుండా నిల్వ చేసుకోగలగడం ఇంకో ప్రత్యేకత. కొంచెం సులువుగా చెప్పుకోవాలంటే.. మీ ఇంటిపైకప్పుపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకుని 'ప్యూర్‌పవర్: హోం'ను వాడటం మొదలుపెట్టారనుకోండి.. మీ ఇంటికి కావాల్సిన విద్యుత్తును అక్కడికక్కడ ఉత్పత్తి చేసుకుని వాడుకోవడమే కాకుండా.. మిగిలిపోయిన విద్యుత్తును నేరుగా ప్రభుత్వానికి అమ్ముకోవచ్చునన్నమాట. నీతీఆయోగ్ సభ్యుడు, డీఆర్‌డీవో మాజీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ వి.కె.సారస్వత్ మంగళవారం హైదరాబాద్‌లోని నోవోటెల్‌లో ప్యూర్‌పవర్ ఉత్పత్తులను లాంఛనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా ప్యూర్ సంస్థ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నిశాంత్ దొంగరి మాట్లాడుతూ ''దేశం మొత్తమ్మీద రానున్న 18 నెలల్లో 300 మంది డీలర్ల ద్వారా 'ప్యూర్‌పవర్' ఉత్పత్తులను మార్కెట్ చేయనున్నాము'' అని తెలిపారు. యూపీఎస్‌లతో పోలిస్తే ప్యూర్‌పవర్ ఎన్నో విధాలుగా ప్రత్యేకమైనవని, నానో పీసీఎం మెటీరియల్ ద్వారా భద్రతకు పెద్దపీట వేశామని ఆయన తెలిపారు. ప్యూర్‌పవర్‌లో ప్రస్తుతం రెండు రకాలను మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నామని, గ్రిడ్ స్థాయిలో విద్యుత్తును నిల్వ చేసే 'ప్యూర్‌పవర్: గ్రిడ్'ను వచ్చే ఏడాది లాంచ్ చేస్తామన్నారు. ఇళ్లల్లో, అపార్ట్‌మెంట్లలో వాడుకోగలిగిన 'ప్యూర్‌పవర్:హోం' 3 కిలోవోల్ట్ ఆంపియర్ (కేవీఏ), 5కేవీఏ, 15కేవీఏ సామర్థ్యాల్లో లభిస్తాయని ధర రూ.74,999తో ప్రారంభమవుతాయని చెప్పారు.
దుకాణాలు, కార్యాలయాలు, టెలికాం టవర్స్ వంటి వాటి కోసం 25 కేవీఏ నుంచి 100 కేవీఏల సామర్థ్యం గల 'ప్యూర్‌పవర్' కమర్షియల్‌ను అందుబాటులోకి తెస్తున్నామని నిశాంత్ వివరించారు. వీటి వాడకం ద్వారా డీజిల్ జనరేటర్ల అవసరాన్ని లేకుండా చేసుకోవచ్చునని తెలిపారు. ప్యూర్‌పవర్ మూడో ఉత్పత్తి గ్రిడ్ స్థాయిలో విద్యుత్తును నిల్వ చేసుకునేదని, 20 అడుగుల పొడవైన కంటెయినర్‌లోకి ఇమిడిపోయే 'ప్యూర్‌పవర్: గ్రిడ్'లో ఏకంగా నాలుగు మెగావాట్ల విద్యుత్తును నిల్వ చేసుకోవచ్చునని ఆయన వివరించారు. సోలార్ పార్కుల్లో వీటిని ఏర్పాటు చేసుకుంటే.. విద్యుత్తు డిమాండ్ తక్కువగా ఉన్న సమయంలో ఉత్పత్తి చేసిన విద్యుత్తును ఎక్కువ ఉన్న సమయంలో సరఫరా చేసేందుకు వీలేర్పడుతుందన్నారు. ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి ఈ ఉత్పత్తులను బుక్ చేసకోవచ్చునని, నెలాఖరు నుంచి డెలివరీ మొదలవుతుందని తెలిపారు.

**దేశ అభివృద్ధికి కీలకం..**

**2070 నాటికి కర్బన్ ఉద్గారాలను సున్నాస్థాయికి తీసుకొచ్చేందుకు చేస్తున్న ప్రయత్నాల్లో విద్యుత్తు వాహనాలతోపాటు ప్యూర్-పవర్ లాంటి ఉత్పత్తులు ఎంతో ఉపయోగపడతాయని నీతి ఆయోగ్ సభ్యులు వీకే సారస్వత్ స్పష్టం చేశారు. ప్యూర్-పవర్ ఉత్పత్తుల ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 2030 నాటికి వాహనాల్లో 40 శాతం విద్యుత్తుతో నడిచేవిగా చేయాలని ప్రభుత్వం తీర్మానించిందని, కోటి ఇళ్ల పైకప్పులపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటుకు సంకల్పించిందని వివరించారు. అయితే ప్రస్తుతం దేశం మొత్తమ్మీద ఉన్న విద్యుత్తు వాహనాల సంఖ్య (అన్ని రకాలు కలుపుకుని) ఇరవై లక్షలకు మించడం లేదని తెలిపారు. విద్యుత్తు వాహనాల ఛార్జింగ్ కోసం గ్రిడ్‌ను వాడటం మొదలుపెడితే గ్రిడ్‌పై అధిక భారం పడుతుందని, ఈ నేపథ్యంలోనే ప్యూర్-పవర్ వంటి ఉత్పత్తులకు ప్రాధాన్యం ఏర్పడుతోందని అన్నారు. బ్యాటరీల ధరలు తగ్గించేందుకు, మరింత సమర్థమైన వాటిని తయారు చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలు ఫలితస్తే మరింత మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్యూర్ సంస్థ సహ వ్యవస్థాపకుడు రోహిత్ వడేరా తదితరులు పాల్గొన్నారు.**

# వరుస లాభాలకు బ్రేక్.. స్థిరంగా స్టాక్ మార్కెట్ సూచీలు

**దేశీయ స్టాక్‌మార్కెట్లు మంగళవారం స్థిరంగా ముగిశాయి. మార్కెట్లు ముగిసే సమయానికి నిఫ్టీ 10 పాయింట్లు లాభపడి 23,668 వద్దకు చేరింది. సెన్సెక్స్ 32 పాయింట్లు ఎగబాకి 78,017 వద్దకు చేరింది. ఇటీవల వరుసగా పెరిగిన మార్కెట్ సూచీలు ఈరోజు ఒడిదొడుకులకు లోనయింది. భారీగా పెరిగిన మార్కెట్ల నుంచి ఇన్వెస్టర్ల మంగళవారం లాభాలు స్వీకరించినట్లు నిపుణులు అంచనా వేస్తున్నారు.**



**ఈ రోజు మార్కెట్ల ఒడిదొడుకులకుగల కారణాలను నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇన్వెస్టర్లు ఇటీవలి లాభాలను స్వీకరించేందుకు పూనుకున్నారు. ఇది అమ్మకాల ఒత్తిడికి దారితీసింది. డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ ప్రకటనలపై ఆందోళనలు పెరిగాయి. ఏప్రిల్ 2న ఏమేరకు టారిఫ్ నిర్ణయాలుంటాయోనని పెట్టుబడిదారులు ముందునుంచే అప్రమత్తంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తుంది.**

సెన్సెక్స్ 30 సూచీలో అల్ట్రాటెక్ సిమెంట్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఇన్ఫోసిస్, యాక్సిస్ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హెచ్‌యూఎల్, టీసీఎస్, ఏషియన్ పెయింట్స్ స్టాక్‌లు లాభాల్లో ముగిశాయి. జొమాటో, ఇండస్ ఇండ్ బ్యాంక్, అదానీ పోర్ట్స్ అండ్ సెజ్, ఎం అండ్ ఎం, ఎస్‌బీఐ, సన్‌ఫార్మా, ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, టాటా స్టీల్, టైటాన్, మారుతీ సుజుకి, పవర్‌గ్రిడ్, ఎల్ అండ్ టీ, కోటక్ మహీంద్రా బ్యాంక్, టాటా మోటర్స్ స్టాక్‌లు నష్టపోయాయి.

# నన్ను దెబ్బ కొట్టేందుకు వాళ్లు కోట్లు ఖర్చు పెట్టారు



హిందీ, తెలుగు, తమిళం అంటూ అన్ని ఇండస్ట్రీలలో పరుగులు పెడుతున్న స్టార్ హీరోయిన్ పూజా హెగ్డే. మొదట్లో మాతృభాషలో నటించడం ప్రారంభించిన ఈ మరాఠీ బ్యూటీ ఆ తరువాత హిందీ, తెలుగు, తమిళ భాషల్లో నటిస్తూ పాన్ ఇండియా కథానాయకిగా రాణిస్తున్నారు. అయితే ప్రతి విజయం వెనుక కఠిన శ్రమ ఉంటుందని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం ఉండదు. అదేవిధంగా ఎన్నో అవమానాలు, బాధలు, మనస్థాపం వంటి చేదు అనుభవాలు ఉంటాయి. ఇందుకు నటి పూజా హెగ్డే అతీతం కాదు. తెలుగులో ప్రభాస్, అల్లు అర్జున్, మహేష్ బాబు వంటి అగ్ర హీరోల సరసన నటించిన ఈ బ్యూటీ తమిళంలో విజయ్‌తో బీస్ట్ చిత్రంలో జత కట్టారు.

ప్రస్తుతం నటుడు సూర్య సరసన నటించిన రెట్రో చిత్రం మే 1వ తేదీన తెరపైకి రానుంది. కాగా తాజాగా విజయ్‌కి జంటగా మరోసారి జన నాయకన్ చిత్రంలో నటిస్తున్నారు. నృత్య దర్శకుడు రాఘవ లారెన్స్‌కు జంటగా కాంచన 4 లో నటిస్తున్నారు.కాగా అగ్ర కథానాయకి రాణిస్తున్న పూజా హెగ్డే తన జీవితంలో ఎదుర్కొన్న చేదు అనుభవాలను ఇటీవల ఒక కార్యక్రమంలో పాల్గొన్నారు. తన గురించి సామాజిక మాధ్యమాల్లో ఎన్నో రకాలుగా ట్రోలింగ్స్ చేశారన్నారు. అవి తన కుటుంబాన్ని చాలా బాధించాయని ఆవేదనను వ్యక్తం చేశారు.

ఇంకో విషయం ఏమిటంటే నటిగా తన ఎదుగుదలను దెబ్బ కొట్టాలని కొందరు కోట్ల రూపాయలు ఇచ్చి ట్రోలింగ్స్ చేయించారని అర్థం అయ్యిందన్నారు. అయితే, తనపై వచ్చిన ట్రోలింగ్ చూసి తల్లిదండ్రులు బాధపడినట్లు ఆమె చెప్పారు. ఆ ట్రోలింగ్ ఆపేయాలన్నా డబ్బు చెల్లించాలని తనను కొందరు కోరారని ఆమె తెలిపారు. అయితే, తానెవరికీ ఎలాంటి చెడు చేయలేదని, అయినా తనపై ఎందుకు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారో తెలియడం లేదన్నారు. అయితే కొంత కాలం తర్వాత అలాంటి ట్రోలింగ్‌స్‌ను పట్టించుకోవడం వదిలేశానని పూజా హెగ్డే చెప్పారు. ప్రస్తుతం తన దృష్టి అంతా సినిమాల పైనేనని నటి పూజా హెగ్డే పేర్కొన్నారు.

# సినిమాల్లో నటించడంపై క్లారిటీ ఇచ్చిన పవన్ కల్యాణ్



ఏపీ డిప్యూటీ సీఎం, సినీ నటుడు పవన్ కల్యాణ్ సినీరంగంలో కొనసాగుతారా..? మళ్లీ కొత్త సినిమాలు చేస్తారా..? అని అభిమానుల్లో చర్చ జరుగుతున్న సందర్భంలో ఈ విషయంపై తాజాగా ఆయన క్లారిటీ ఇచ్చారు. ప్రస్తుతం పవన్ చేతిలో ఓజీ, హరిహర వీరమల్లు, ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలు ఉన్నాయి. అయితే, ఉస్తాద్ భగత్ సింగ్ మాత్రం రావడం కష్టమేనని ఇప్పటికే వార్తలు వచ్చాయి. కానీ, ఈ మూడు సినిమాల కోసం పవన్ ఇప్పటికే చాలా సమయం తీసుకున్నారు. దీంతో నిర్మాతలకు బడ్జెట్ పెరిగి తలనొప్పిగా మారిందని కూడా చెబుతున్నారు.

తమిళ మీడియాకు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో తన సినిమాల గురించి పవన్ కల్యాణ్ మాట్లాడారు. తనకు డబ్బు అవసరం ఉన్నంత వరకూ నటిస్తూనే ఉంటానని చెప్పారు. అయితే, తాను సినిమా నిర్మాణరంగంలో మాత్రం భాగం కానన్నారు. 'నాకు ఉన్న ఏకైకా ఆదాయమార్గం నటన మాత్రమే.. నాకు డబ్బు అవసరం ఉన్నంత వరకూ నటిస్తూనే ఉంటాను.' అని పవన్ అన్నారు. 2020 ముందు వరకు పవన్ కల్యాణ్ రెమ్యునరేషన్ కేవలం రూ. 15 కోట్ల లోపు మాత్రమే అని ఇండస్ట్రీలో చెబుతున్న మాట.. అయితే, వకీల్‌సాబ్ సినిమా నుంచి ఆయన రూ. 50 కోట్లు తీసుకున్నట్లు తెలుస్తోంది.

# శివభక్తుడిగా మారిపోయా: విష్ణు మంచు



“నేను ఆంజనేయస్వామి భక్తుడిని. కానీ ‘కన్నప్ప’ సినిమా ప్రయాణంతో శివభక్తుడిగా మారిపోయాను. మా చిత్రం అందర్నీ ఆకట్టుకునేలా ఉంటుంది” అని విష్ణు మంచు అన్నారు. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వంలో విష్ణు మంచు హీరోగా రూపొందిన సినిమా ‘కన్నప్ప’. మోహన్ బాబు, శరత్ కుమార్, మోహన్ లాల్, బ్రహ్మానందం, ప్రభాస్, కాజల్ అగర్వాల్ ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు.
అవా ఎంటర్‌టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ పతాకాలపై మంచు మోహన్ బాబు నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 25న రిలీజ్ కానుంది.

కాగా హైదరాబాద్‌లో జరిగిన ‘రెడ్ లారీ ఫిల్మ్ ఫెస్టివల్’లో ‘కన్నప్ప’ యూనిట్ పాల్గొంది. ఈ సందర్భంగా విష్ణు మంచు మాట్లాడుతూ– “‘కన్నప్ప’లో ప్రభాస్ పాత్రని ఆడియన్స్ ఎంత ఊహించుకున్నా.. అంతకుమించి ఉంటుంది” అని తెలిపారు.

“2016 జనవరిలో నేను శ్రీకాళహస్తికి వెళ్లి శివుణ్ణి దర్శించుకున్నాను. ఆ శివుడే నన్ను ‘కన్నప్ప’ప్రాజెక్ట్‌లోకి పంపించాడు. అదే శివ లీల” అని చెప్పారు ముఖేష్ కుమార్ సింగ్. బ్రహ్మాజీ, రఘుబాబు పాల్గొన్నారు.

# క్రికెట్ స్టోరీతో వెబ్ సిరీస్.. ట్రైలర్ చూశారా?



క్రికెట్ బ్యాక్ డ్రాప్ స్టోరీతో ఇప్పటికే పలు సినిమాలు, వెబ్ సిరీసులు వచ్చాయి. ఇప్పుడు అలాంటి కంటెంట్ తో వస్తున్న లేటెస్ట్ సిరీస్ 'టెస్ట్'. మాధవన్, నయనతార, సిద్దార్థ్ ప్రధాన పాత్రల్లో నటించారు. నేరుగా ఓటీటీలో రిలీజ్ కానున్న ఈ సిరీస్ ట్రైలర్ ని తాజాగా విడుదల చేశారు. చెన్నైలో జరిగిన ఇండియా vs పాకిస్థాన్ టెస్టు మ్యాచ్.. ముగ్గురు వ్యక్తుల జీవితాల్ని ఎలా ప్రభావితం చేసిందనే కథతో ఈ సిరీస్ తీశారు. ఏప్రిల్ 4 నుంచి నెట్‌ఫ్లిక్స్ లో ఇది స్ట్రీమింగ్ కానుంది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో అందుబాటులోకి రానుంది.



# ‘బ్యూటీ’ భామ నీలఖికి యంగ్ సెన్సేషన్ అవార్డు



‘బ్యూటీ’ అనే చిత్రంతో నీలఖి త్వరలో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఈ సినిమాను గీతా సుబ్రమణ్యం, ‘హలో వరల్డ్’ ఫేమ్ వర్ధన్ దర్శకత్వంలో రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో అంకిత్ కొయ్య హీరోగా, నీలఖి హీరోయిన్‌గా నటించారు. నీలఖి తెలుగు సినిమా పరిశ్రమలోకి అడుగు పెట్టకముందే ఒడిశాలో తన ప్రతిభను చాటుకున్నారు. ఒడిశాలోని ప్రముఖ ఛానెల్ తరంగ్ టీవీ నిర్వహించిన ‘తరంగ్ సినీ ఉత్సవ్’ కార్యక్రమంలో ‘యంగ్ సెన్సేషన్ ఆఫ్ ది ఇయర్ డెబ్యూ ఫీమేల్’ విభాగంలో నీలఖి అవార్డును గెలుచుకున్నారు. తెలుగు ప్రేక్షకులను కూడా తన నటనతో ఆకట్టుకుంటారని ‘బ్యూటీ’ టీమ్ గట్టి విశ్వాసంతో ఉంది. ఇప్పటికే విడుదలైన ‘బ్యూటీ’ సినిమా పోస్టర్లు, టీజర్‌లో నీలఖి అందరి దృష్టిని ఆకర్షించారు. ఆమె నటనలో భావోద్వేగాలను అద్భుతంగా పండించారని టీమ్ గతంలోనే వెల్లడించింది. ‘బ్యూటీ’ చిత్రంతో నీలఖి తెలుగు సినిమా పరిశ్రమలోకి ఘనంగా అడుగు పెట్టేందుకు సిద్ధమయ్యారు. ఈ సినిమా త్వరలో థియేటర్లలో విడుదల కానుంది. వానరా సెల్యులాయిడ్ బ్యానర్‌పై మారుతి టీమ్‌తో కలిసి జీ స్టూడియోస్ సమర్పిస్తోన్న ఈ చిత్రానికి అడిదాల విజయపాల్ రెడ్డి, ఉమేష్ కేఆర్ బన్సాల్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు.

# దర్శకుడితో నయనతార గొడవ.. ఆగిపోయిన సినిమా!

**స్టార్ హీరోయిన్ నయనతార ఈ మధ్య ఎక్కువ విమర్శలకు గురవుతుంది. రీసెంట్ గానే ఆమెపై నెటిజన్లు మండిపడ్డారు. మూకుత్తి అమ్మన్ 2 సినిమా పూజా కార్యక్రమాల్లో తోటి నటి మీనాను అవమానపరిచారు అంటూ ఆమెను ట్రోల్ చేశారు. తాజాగా నయనతారపై మరో పుకారు నెట్టింట హల్‌చల్ చేస్తోంది. మూకుత్తి అమ్మన్ 2 సినిమా సెట్‌లో అసిస్టెంట్ డైరెక్టర్‌తో నయనతార గొడవపడిందట. ఇదే విషయంపై దర్శకుడు సుందర్.సీ, నయనతారల మధ్య విభేధాలు రావడంతో షూటింగ్ నిలిపివేసిట్లు తెలుస్తోంది.**

నయనతార హీరోయిన్‌గా సుందర్ సి దర్శకత్వంలో ‘మూకుతి అమ్మన్ 2’ చిత్రం రూపొందుతున్న విషయం తెలిసిందే. ఇటీవల ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైంది. తాజాగా కాస్ట్యూమ్ విషయంలో నయనతార , ఒక అసిస్టెంట్ డైరెక్టర్ మధ్య చిన్న పాటి వివాదం జరిగినట్లు సమాచారం. ఈ సంఘటన నయనతారకు నచ్చకపోవడంతో ఆమె ఆ అసిస్టెంట్ డైరెక్టర్‌ను తీవ్రంగా మందలించినట్లు తెలుస్తోంది.

ఈ చిన్న విషయం కాస్త పెద్ద వివాదంగా మారడంతో దర్శకుడు సుందర్ సి షూటింగ్‌కు తాత్కాలిక విరామం ప్రకటించినట్లు వినికిడి. నయనతార ప్రవర్తన సుందర్ సికి సంతృప్తి కలిగించకపోవడంతో, ఆమెను సినిమా నుంచి తొలగించి, మరో సీనియర్ నటిని తీసుకొని చిత్రాన్ని కొనసాగించాలనే ఆలోచన చేశాడట. అయితే నిర్మాత ఇషారి కె. గణేష్ జోక్యం చేసుకుని నయనతారతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించారట. ప్రస్తుతం చెన్నైలోని ఓ దేవాలయంలో ఈ సినిమా **షూటింగ్ జరుగుతుంది.**

'మూకుత్తి అమ్మన్ 2' విషయానికొస్తే.. 2020లో సూపర్ హిట్‌గా నిలిచిన ‘మూకుత్తి అమ్మన్' సినిమాకు సీక్వెల్ ఇది. ‘మూకుత్తి అమ్మన్' చిత్రానికి ఆర్జే బాలాజీ దర్శకత్వం వహించగా.. సీక్వెల్‌ని సుందర్.సి తెరకెక్కిస్తున్నాడు.ఈ సినిమాలో నయనతారతో పాటు ఇనియా, రెజీనా కసెండ్రా, మైనా నందిని, దునియా విజయ్, సింగం పులి, యోగిబాబు లాంటి పెద్ద స్టార్స్ ఉన్నారు. ఈ సినిమాలో అమ్మన్ క్యారెక్టర్‌లో నటించడానికి నయనతార నెల రోజులకు పైగా ఉపవాసం ఉండి నటిస్తున్నారు. ఈ సినిమాకి హిప్ హాప్ ఆది మ్యూజిక్ డైరెక్టర్.



## అదరగొట్టిన శ్రేయస్.. గుజరాత్ ముందు భారీ టార్గెట్

**గుజరాత్ టైటాన్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ బ్యాటింగ్ ముగిసింది. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 243 పరుగులు చేసింది.**

ఐపీఎల్ 2025 లో భాగంగా పంజాబ్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్ తలపడుతున్నాయి. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ 20 ఓవర్లలో ఐదు వికెట్లకు 243 పరుగులు చేసింది. శ్రేయస్ అయ్యర్ (97*; 42 బంతుల్లో 5 ఫోర్లు, 9 సిక్స్‌లు) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. భారీ షాట్లతో స్కోరుబోర్డును పరుగెత్తించాడు. ప్రసిద్ధ్ కృష్ణ వేసిన 17వ ఓవర్లో వరుసగా 6,4,6,6 బాదేశాడు. ఆఖర్లో శశాంక్ సింగ్ (44*; 16 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరుపు ప్రదర్శన చేశాడు. 19 ఓవర్లు పూర్తి అయ్యేసరికి 97 పరుగులకు చేరుకున్న శ్రేయస్‌కు చివరి ఓవర్‌లో బ్యాటింగ్ చేసే అవకాశం రాలేదు. ఆఖరి ఓవర్‌లో స్ట్రైకింగ్‌లో ఉన్న శశాంక్ ఏకంగా ఐదు ఫోర్లు కొట్టడం విశేషం.

మ్యాచ్ ప్రారంభంలో ఓపెనర్ ప్రియాంశ్ ఆర్య (47; 23 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) బ్యాట్ ఝుళిపించాడు. మ్యాక్స్‌వెల్ (0) నిరాశపర్చాడు. సాయి కిశోర్ బౌలింగ్‌లో తాను ఎదుర్కొన్న తొలి బంతికే అతడు ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. ప్రభ్‌సిమ్రన్ సింగ్ 5 (8), అజ్మతుల్లా ఒమర్జాయ్ 16 (15), స్టాయినిస్ 20 (15) పరుగులు చేశారు. గుజరాత్ బౌలర్లలో సాయికిశోర్ 3 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. రబాడ, రషీద్ ఖాన్ తలో వికెట్ తీశారు.



## టీమ్ఇండియాకు ఎంపికవడం నా చేతిలో లేదు: సిరాజ్

**టీమ్ ఇండియాకు ఎంపిక తన చేతిలో లేదని సిరాజ్ అన్నాడు. తన దృష్టి అంతా మ్యాచుల్లో బాగా ఆడటంపైనే ఉంటుందని, తన టీమ్‌ను గెలిపించడం కోసం వికెట్లు తీయడం గురించే ఆలోచిస్తా అని వివరించాడు.**

ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ కు ప్రాతినిధ్యం వహిస్తున్న మహ్మద్ సిరాజ్ టీమ్ఇండియా లో పునరాగమనం గురించి మాట్లాడాడు. భారత జట్టుకు ఎంపికవడం తన చేతిలో ఏమీ లేదన్నాడు. తన ఫోకస్ అంతా చక్కగా బౌలింగ్ చేయడంపైనే ఉంటుందని వివరించాడు. తన టీమ్ విజయం కోసం వికెట్లు తీయడంపైనే తన దృష్టి ఉంటుందని చెప్పాడు. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ లో 31.15 సగటుతో 20 వికెట్లు పడగొట్టినప్పటికీ సిరాజ్‌కు ఇంగ్లాండ్‌తో జరిగిన సిరీస్, ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ లో ఆడే అవకాశం దక్కలేదు. సెలక్షన్ గురించి ఆలోచించడం తన ఆటతీరుపై ప్రభావం చూపిస్తోందన్నాడు. అందుకే అప్పటి నుంచి తన చేతిలో లేని విషయాల గురించి ఆలోచించడం మానేశా అని వివరించాడు.

'జట్టుకు ఎంపిక అనేది నా నియంత్రణలో లేని వ్యవహారం. వికెట్లు తీయడం, టీమ్ విజయం కోసం కృషి చేయడం ఒక్కటే నా చేతిలో ఉంది. అందుకోసం నేను వందకు వందశాతం కృషి చేస్తా. సెలక్షన్ గురించి ఆలోచిస్తూ కూర్చుంటే నా ఆటతీరు దెబ్బతింటోంది. టీ 20 వరల్డ్ కప్ లో ఎంపిక కోసం ఆలోచించా. కానీ చక్కగా బౌలింగ్ చేయలేకపోయా. అప్పుడే నాకు ఓ విషయం అర్థమైంది... నా చేతుల్లో లేని అంశాల గురించి అనవసరంగా ఆలోచించవద్దని. కేవలం ఆటతీరు మెరుగుపరుచుకోవడం పైనే దృష్టి పెట్టాను' అని సిరాజ్ మీడియాతో అన్నాడు.

## 'విడాకులు మాత్రమే కావాలి.. నేనేమీ బికారిని కాదు.. ఆ దెయ్యం డబ్బు నాకొద్దు'

**"నాకు విడాకులు మాత్రమే కావాలి.. అతడి నుంచి ఒక్క పైసా కూడా అవసరం లేదు" అంటూ భారత బాక్సర్, ప్రపంచ చాంపియన్ స్వీటీ బూరా తీవ్ర భావోద్వేగానికి గురైంది. భర్త దీపక్ హుడా తో వీలైనంత త్వరగా వైవాహిక బంధం తెంచుకోవాలని మాత్రమే భావిస్తున్నట్లు తెలిపింది. కాగా స్వీటీతో పాటు దీపక్ కూడా దేశానికి ప్రాతినిథ్యం వహించిన ప్రముఖ కబడ్డీ ఆటగాడు.**

అంతేకాదు.. 2019 2022 వరకు భారత కబడ్డీ జట్టు కెప్టెన్‌గానూ ఉన్నాడు. ప్రొ కబడ్డీ లీగ్‌లోనూ తెలుగు టైటాన్స్, పుణేరి పల్టన్, పట్నా పైరేట్స్ తదితర జట్లకు ప్రాతినిథ్యం వహించాడు. మరోవైపు.. స్వీటీ బూరా 81 కిలోల విభాగంలో 2023లో ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో పసిడి పతకం సాధించింది.

**అదనపు కట్నం కోసం**

ఇక దీపక్‌తో పాటు స్వీటీ కూడా అర్జున అవార్డు గ్రహీత కావడం విశేషం. ఈ క్రీడా జంట 2022లో వివాహం చేసుకున్నారు. అయితే, భర్తతో పాటు అత్తింటి వారు తనను అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని స్వీటీ బూరా ఇటీవలే పోలీసులకు ఫిర్యాదు చేసింది. వాళ్లు కోరినట్లుగా గతంలోనే విలాసవంతమైన కారు ఇచ్చినా.. ఇంకా డబ్బు కావాలంటూ తనను హింసిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొంది.

ఈ క్రమంలో ఫిబ్రవరి 25న దీపక్‌పై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అయితే, ఇందుకు సంబంధించి పోలీసులు నోటీసులు ఇచ్చినా దీపక్ కుటుంబం నుంచి ఎలాంటి స్పందనా రాలేదని హిస్సార్ పోలీసులు జాతీయ మీడియాకు తెలిపారు.

ఈ నేపథ్యంలో తన భర్తలో మార్పు రావడం కష్టమని భావించిన స్వీటీ బూరా విడాకుల కోసం దరఖాస్తు చేసినట్లు సమాచారం. ఈ క్రమంలో ఇటీవల పోలీస్ స్టేషన్‌లో స్వీటీ దీపక్‌లు తమ మద్దతుదారులతో కలిసి సెటిల్‌మెంట్ కోసం రాగా.. కోపోద్రిక్తురాలైన స్వీటీ భర్తపై దాడి చేసింది. పోలీస్ స్టేషన్‌లోనే అతడిపై పిడిగుద్దులు కురిపించింది. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో స్వీటీ సహనం నశించినందు వల్లే ఇలా చేసిందని కొంతమంది మద్దతునివ్వగా.. భరణం కోసం డిమాండ్ చేస్తోందంటూ మరికొంత మంది ఆరోపించారు. అయితే, స్వీటీ మాత్రం వీటిని కొట్టిపారేసింది. మీడియాతో మాట్లాడుతూ.. ''నాకు విడాకులు కావాలి. అతడి నుంచి ఎలాంటి భరణం అక్కర్లేదు.

**నేనేమీ బికారిని కాదు..**

**ఆ దెయ్యం డబ్బు నాకొద్దు**

నా వస్తువులు నాకు తిరిగి ఇచ్చేస్తే చాలు. ఈ సమస్యకు శాంతియుతమైన పరిష్కారం లభించాలని మాత్రమే కోరుకుంటున్నా. హింసకు, అణచివేతకు వ్యతిరేకంగా గొంతెత్తడమే నేను చేసిన తప్పు అనుకుంటా. విడాకుల కోసం నేను కోర్టులో పిటిషన్ వేశాను. ఇందుకు సంబంధించి అన్ని ఆధారాలు సమర్పించా. ఆ వ్యక్తి విడాకులు వద్దంటూ నాపై ఒత్తిడి తెస్తున్నాడు. అయినా ఆ దెయ్యం డబ్బులు నాకెందుకు? నేనేమీ బికారిని కాదు. నాకు న్యాయం మాత్రమే కావాలి. ఇంకేమీ వద్దు'' అంటూ స్వీటీ బూరా తీవ్ర భావోద్వేగానికి లోనైంది.

# పోరాడి ఓడిన గుజరాత్..
# బోణీ కొట్టిన పంజాబ్

**ఐపీఎల్ 18వ సీజన్‌లో పంజాబ్ బోణీ కొట్టింది. గుజరాత్ టైటాన్స్‌పై ఆజట్టు 11 పరుగుల తేడాతో గెలుపొందింది.**

**అహ్మదాబాద్:** ఐపీఎల్ 18వ సీజన్‌లో పంజాబ్ కింగ్స్ శుభారంభం చేసింది. సొంత మైదానంలో గుజరాత్ టైటాన్స్ జట్టు పోరాడి ఓడింది. అహ్మదాబాద్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో పంజాబ్ 11 పరుగుల తేడాతో గెలుపొందింది. 244 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 232 పరుగులు చేసింది. ఆ జట్టులో సాయి సుదర్శన్ (74; 41 బంతుల్లో 5 ఫోర్లు, 6 సిక్స్‌లు), శుభ్‌మన్ గిల్ (33; 14 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), జోస్ బట్లర్ (54; 33 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), రుథర్‌ఫోర్డ్ (46; 27 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) దూకుడుగా ఆడినప్పటికీ భారీ లక్ష్యం కావడంతో ఓటమి చవిచూసింది. పంజాబ్ బౌలర్లలో అర్‌ష్‌దీప్ సింగ్ 2, మాక్స్‌వెల్, యాన్సెన్ ఒక్కో వికెట్ తీశారు.



**చెలరేగిన శ్రేయస్, శశాంక్..**

టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ 20 ఓవర్లలో ఐదు వికెట్లకు 243 పరుగులు చేసింది. శ్రేయస్ అయ్యర్ (97*; 42 బంతుల్లో 5 ఫోర్లు, 9 సిక్స్‌లు) త్రుటిలో శతకం మిస్ చేసుకున్నాడు. భారీ షాట్లతో స్కోరుబోర్డును పరుగెత్తించాడు. ఆఖర్లో శశాంక్ సింగ్ (44*; 16 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరుపు ప్రదర్శన చేశాడు. 19 ఓవర్లు పూర్తి అయ్యేసరికి 97 పరుగులకు చేరుకున్న శ్రేయస్ కు చివరి ఓవర్‌లో బ్యాటింగ్ చేసే అవకాశం రాలేదు. ఆఖరి ఓవర్‌లో స్ట్రైకింగ్‌లో ఉన్న శశాంక్ ఏకంగా ఐదు ఫోర్లు కొట్టాడు. మ్యాచ్ ప్రారంభంలో ఓపెనర్ ప్రియాంశ్ ఆర్య (47; 23 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) బ్యాట్ ఝుళిపించాడు. మ్యాక్స్‌వెల్ (0) నిరాశపర్చాడు. సాయి కిశోర్ బౌలింగ్‌లో తాను ఎదుర్కొన్న తొలి బంతికే అతడు ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. ప్రభ్‌సిమ్రన్ సింగ్ 5 (8), అజ్మతుల్లా ఒమర్జాయ్ 16 (15), స్టాయినిస్ 20 (15) పరుగులు చేశారు. గుజరాత్ బౌలర్లలో సాయికిశోర్ 3 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. రబాడ, రషీద్ ఖాన్ తలో వికెట్ తీశారు.



## మాక్స్‌వెల్ అత్యంత చెత్త రికార్డు.. ఐపీఎల్ చరిత్రలోనే

**ఐపీఎల్-2025 సీజన్‌ను పంజాబ్ కింగ్స్ ఆల్‌రౌండర్ గ్లెన్ మాక్స్‌వెల్ పేలవంగా ఆరంభించాడు. ఈ టోర్నీలో భాగంగా అహ్మదాబాద్ వేదికగా గుజరాత్ టైటాన్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో మాక్స్‌వెల్ గోల్డెన్ డకౌట్‌గా వెనుదిరిగాడు. స్పిన్నర్ సాయి కిషోర్ బౌలింగ్‌లో రివర్స్ స్వీప్ ప్రయత్నించి వికెట్ల ముందు మాక్స్‌వెల్ దొరికిపోయాడు. ఒకవేళ మాక్సీ రివ్యూ తీసుకుని ఉండి ఉంటే ఔటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకునేవాడు.**

ఎందుకంటే బంతి రిప్లేలో వికెట్స్‌ను మిస్ అవుతున్నట్లు తేలింది. తర్వాత డగౌట్ నుంచి రిప్లే చూసిన మాక్సీ షాకయ్యాడు. ఇక ఈ మ్యాచ్‌లో డకౌటైన మాక్స్‌వెల్ అత్యంత చెత్త రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో అత్యధిక డకౌట్‌లు అయిన ఆటగాడిగా మాక్స్‌వెల్ నిలిచాడు.

ఈ ఆస్ట్రేలియా స్టార్ ఆల్‌రౌండర్ ఐపీఎల్‌లో ఇప్పటివరకు 19 సార్లు డకౌటయ్యాడు. ఇంతకుముందు ఈ చెత్త రికార్డు సాధించిన జాబితాలో రోహిత్ శర్మ(18), దినేష్ కార్తీక్(18)లో కలిసి మాక్సీ సంయుక్తంగా ఉన్నాడు. ఇప్పుడు తాజా మ్యాచ్‌తో ఈ చెత్త రికార్డును తన ఒక్కడి ఖాతాలో వేసుకున్నాడు.

ఇక ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 243 పరుగులు చేసింది. పంజాబ్ బ్యాటర్లలో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్( 42 బంతుల్లో 5 ఫోర్లు, 9 సిక్స్‌లతో 97) అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. గుజరాత్ బౌలర్లలో సాయికిషోర్ మూడు, రబాడ, రషీద్ ఖాన్ తలా వికెట్ సాధించారు.

## ఆ ధైర్యంతోనే ఆటగాళ్లు భయం లేకుండా ఆడుతున్నారు: ధోనీ

**చెన్నై సూపర్ కింగ్స్ మాజీ సారథి ఎంఎస్ ధోనీ ఇంపాక్ట్ ప్లేయర్ రూల్‌పై స్పందించాడు.**

చెన్నై సూపర్ కింగ్స్ మాజీ సారథి ఎంఎస్ ధోనీ ఇంపాక్ట్ ప్లేయర్ రూల్‌ని సమర్థించాడు. అయితే, ఈ రూల్ వచ్చిన కొత్తలో తనకు అస్సలు నచ్చలేదని, ఇది అవసరం లేదని అనిపించిందని పేర్కొన్నాడు. ఇంపాక్ట్ ప్లేయర్ రూల్‌ని ఐపీఎల్ 2023 సీజన్‌లో ప్రవేశపెట్టారు. ఈ నియమం వల్ల అదనంగా ఒక బ్యాటర్ లేదా బౌలర్‌ను తీసుకుంటూ జట్లు ప్రయోజనం పొందుతున్నాయి. ముఖ్యంగా ఎక్స్‌ట్రా బ్యాటర్‌ను బరిలోకి దింపి టీమ్ భారీ స్కోరు సాధించేలా చేస్తున్నాయి. గత సీజన్‌లో 41 సార్లు 200కుపైచిలుకు స్కోర్లు నమోదయ్యాయి. కానీ, ఇంపాక్ట్ ప్లేయర్ వల్ల భారీ స్కోర్లు నమోదు కావడం లేదని, ఆటగాళ్ల మైండ్ సెట్ మారడంతోనే ఇది సాధ్యమవుతోందని ధోనీ పేర్కొన్నాడు.

**ఈ 'మహి'మ తనకే సొంతం... 43 ఏళ్ల వయసులోనూ ధోని మ్యాజిక్**

'ఈ రూల్‌ను అమలు చేసిన కొత్తలో నాకైతే ఇది అనవసరమనిపించింది. ఒక విధంగా ఈ రూల్ నాకు హెల్ప్ అవుతుంది. కానీ, నాకు దీని అవసరం లేదు. నేను ఇప్పటికీ వికెట్ కీపింగ్ చేస్తాను. కాబట్టి నేను ఇంపాక్ట్ ప్లేయర్‌ని కాదు. ఆటలో పాలుపంచుకోవడం నాకు ఇష్టం. ఈ రూల్ వల్ల మ్యాచ్‌ల్లో మరిన్ని భారీ స్కోర్లు నమోదవుతాయని చాలామంది అంటున్నారు. నేనైతే పిచ్ పరిస్థితులు, ప్లేయర్ల కాన్ఫిడెన్స్ లెవల్స్ కూడా భారీ స్కోర్లకు కారణమని నమ్ముతున్నా. అదనపు బ్యాటర్ ఉన్నాడనే ధైర్యంతో ఆటగాళ్లు భయం లేకుండా మరింత దూకుడుగా ఆడుతున్నారు. అలా అని టీమ్స్ నలుగురైదుగురు ఎక్స్‌ట్రా బ్యాటర్లను ఆడించట్లేదు. కానీ, ఆ అదనపు బ్యాటర్ ఉన్నాడనే భరోసాతో మాత్రం ముందుగా వచ్చే బ్యాటింగ్ చేసే ప్లేయర్ల ఆటతీరును మార్చేస్తోంది. టీ20 క్రికెట్ ఇలాగే మారిపోయింది' అని ధోనీ వివరించాడు.



**ప్రస్తుతం ఐపీఎల్ 2025లో ధోనీ సీఎస్కేకు ఆడుతున్న సంగతి తెలిసిందే. 43 ఏళ్ల వయసులోనూ వికెట్‌కీపర్‌గా అదరగొడుతున్నాడు. ముంబయి ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సూర్యకుమార్ యాదవ్‌ను మెరుపు స్టంపింగ్‌తో పెవిలియన్‌కు పంపాడు. ఛేదనలో విన్నింగ్ షాట్ కొట్టే అవకాశం వచ్చినా రెండు డాట్ బాల్స్ ఆడి రచిన్ రవీంద్రకు మ్యాచ్ ముగించే బాధ్యత అప్పగించి విమర్శకుల ప్రశంసలు అందుకున్నాడు. చెన్నై సూపర్ కింగ్స్ తదుపరి మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో తలపడనుంది. ఈ మ్యాచ్ మార్చి 27న చెన్నై వేదికగా జరగనుంది.**

## దిల్లీతో ఓటమిపై పంత్‌తో విభేదించిన అసిస్టెంట్ కోచ్ క్లూసనర్..!

**దిల్లీతో జరిగిన మ్యాచ్‌లో లఖ్‌నవూ ఓటమికి కారణాల విషయంలో రిషభ్ పంత్ వాదనతో జట్టు అసిస్టెంట్ కోచ్ విభేదించాడు.**

ఐపీఎల్‌లో తలపడిన తొలిమ్యాచ్‌లోనే ఓటమికి గల కారణాలపై లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ సమీక్షిస్తోంది. తాజాగా ఓటమికి కారణాల విషయంలో రిషభ్ పంత్ తో అసిస్టెంట్ కోచ్ లాన్స్ క్లూసనర్ విభేదించాడు. బ్యాటర్ల వైఫల్యమే ఈ పరిస్థితికి కారణమని చెప్పాడు.

''నేను ఈ ఓటమికి కారణం చెప్పాలంటే మాత్రం ఒక్కటే. స్కోర్ బోర్డ్‌పై 20 నుంచి 30 పరుగులు తక్కువ చేశాం. అందుకే చివరికి బంతితో తీవ్ర ఒత్తిడి ఎదుర్కోవాల్సి వచ్చింది. దిల్లీ జట్టు మంచి బ్యాటింగ్‌తో మ్యాచ్‌ను ముగించింది. మనం తగినంత స్కోర్ చేయకపోవడమే దానికి కారణం. బౌలింగ్‌తో పోలిస్తే బ్యాటింగ్ ఆర్డర్ అనుభవజ్ఞులు, హిట్టర్లతో కొంత మెరుగ్గా ఉంది. అందుకే మరికొన్ని పరుగులు చేసి ఉండాల్సిందని చెబుతున్నా. మరో మ్యాచ్‌కు మూడు రోజుల సమయం ఉంది. మా కుర్రాళ్లను సానుకూల దృక్పథంతో ఉండమని చెబుతాము'' అని క్లూసనర్ ఓ ఆంగ్ల వార్తా పత్రికకు తెలిపాడు. అంతకు ముందు పంత్ మాట్లాడుతూ.. టాప్ ఆర్డర్ ఆటగాళ్లు బాగానే ఆడారని.. స్కోరు కూడా మెరుగైనదేనని అభిప్రాయపడ్డాడు.

దేశవాళీలో అడుగుపెట్టిన ఏడాదిలోనే.. ఎవరీ విప్రాజ్ నిగమ్..?

ఎల్ఎస్‌జీ డ్రెస్సింగ్ రూమ్‌లోకి గోయెంకా

దిల్లీతో మ్యాచ్ అనంతరం లఖ్‌నవూ యజమాని సంజీవ్ గోయెంకా ఆటగాళ్లతో మాట్లాడినట్లు తెలుస్తోంది. తొలుత ఆయన కెప్టెన్ పంత్‌తో మాట్లాడి.. అనంతరం డ్రెస్సింగ్ రూమ్‌లోకి వెళ్లారు. అక్కడ ఆటగాళ్లతో మాట్లాడారు. ఈ క్రమంలో వారి ముఖంలో దిగులు పోయి చిరునవ్వులు వచ్చాయి. ఫలితం ప్రతికూలంగా ఉన్నా.. జట్టు చివరి వరకు పోరాడిందని ఆయన కితాబిచ్చారు. ''ఈ మ్యాచ్‌లో చాలా సానుకూలాంశాలను చూశాను. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాలు పవర్‌ప్లేలో అద్భుతంగా ఆడారు. గెలుపోటములు సహజం. మనది యువకులతో నిండిన జట్టు. సానుకూలాంశాలనే చూడండి.. రేపటి నుంచి 27వ తేదీ మ్యాచ్‌పైనే దృష్టిపెట్టండి. మెరుగైన ఫలితాలు ఉంటాయని ఆశిస్తున్నాను. నేడు నిరాశపర్చే ఫలితాలు వచ్చినా.. అద్భుతంగా ఆడారు'' అని ఆటగాళ్లతో ఆయన అన్నారు.



మ్యాచ్ అనంతరం పంత్, కోచ్ జస్టిన్ లాంగర్, ఫ్రాంచైజీ యజమాని సంజీవ్ గోయెంకా మాట్లాడుకుంటున్న ఫొటోలు బయటికొచ్చాయి. వీటిపై మీమర్స్ సోషల్ మీడియాలో పలు మీమ్స్ వదిలారు. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ అపజయం పాలవడంతో గత ఏడాది సంజీవ్ .. కేఎల్ రాహుల్ పై బాహాటంగానే అసంతృప్తి వ్యక్తం చేశాడు. అప్పట్లో అది పెను సంచలనమైంది. తాజాగా పంత్, గోయెంకా మధ్య జరిగిన సంభాషణను మీమర్స్ గతంలో కేఎల్ రాహుల్ ఉదంతంతో పోల్చారు.